మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 22-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 23 Issue: 23

22 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి నవమి ఉ. 7:03o వరకు సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం స్వాతి రా. 10:59 వరకు తరువాత విశాఖ యోగం సాధ్య సా. 6:36 వరకు కరణం భాలవ సా. 6:09 వరకు కౌలవ ఉ. 7:02o వరకు వర్జ్యం తె. 5:16 నుండి ఉ. 7:03 వరకు దుర్ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:59 వరకు యమగండం ఉ. 7:32 నుండి ఉ. 9:09 వరకు గుళికాకాలం ఉ. 10:45 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు మ. 1:26 నుండి మ. 3:11 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## 18 ఏళ్లు నిండితే ఏంటి..

### బిడ్డ చదువుకు తండ్రే బాధ్యుడు!

### కర్ణాటక హైకోర్టు తీర్పు

కుటుంబంలో సంబంధాలు దెబ్బతిన్నప్పటికీ, వయోజనురాలైన (మేజర్) అవివాహిత కుమార్తె తన పైచదువుల ఖర్చుల కోసం తల్లిదండ్రులపై గృహ హింస నిరోధక చట్టం కింద కేసు పెట్టవచ్చని, ఆర్థిక సహాయం కోరవచ్చని కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది.

బెంగళూరు: నీట్ పీజీలో 11,722వ ర్యాంకు సాధించి మంగళూరులోని ఫాదర్ ముల్లర్స్ కాలేజీలో ఎం.డి. (డెర్మటాలజీ) ప్రవేశం పొందిన 23 ఏళ్ల కుమార్తె విద్యా ఖర్చుల కోసం రూ. 16 లక్షలు చెల్లించాలని తండ్రిని కోర్టు ఆదేశించింది. తన కుమార్తె ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసిందని, మేజర్ అయినందున పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫీజుల కోసం ఎడ్యుకేషన్ లోన్ తీసుకోవాలని తండ్రి వేసిన పిటిషన్‌ను జస్టిస్ హెచ్.పి. సందేశ్ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ నుండి పీజీ వరకు చదువు అనేది ఒకే విద్యా ప్రయాణమని, తండ్రికి భారీగా ఆస్తులు, ఐటీ రిటర్నుల ప్రకారం తగినంత ఆర్థిక స్థోమత ఉన్నందున ఈ ఖర్చును ఆయనే భరించాలని స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా గృహ హింస నుండి తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,329 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,934 |

## విశ్వవాణి



సంతోషం, బాధ, కోపం, భయం వంటి భావోద్వేగాలను తాము ఏమి అనుభవిస్తున్నామో గుర్తించలేకపోవడం లేదా వాటిని ఇతరులకు వ్యక్తం చేయడంలో ఇబ్బంది పడే వ్యక్తిత్వ లక్షణాన్ని 'అలెక్సిథైమియా' అంటారని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది స్వతంత్ర మానసిక వ్యాధి కాకపోయినా, కొన్ని మానసిక, నాడీ సంబంధిత సమస్యలతో కలిసి కనిపించే అవకాశం ఉందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలెక్సిథైమియా ఉన్నవారు భావోద్వేగాలను స్పష్టంగా గుర్తించలేరట.



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలకంగా పనిచేసిన మేధావులు, ఉద్యమ నాయకుల వర్గంలో అసంతృప్తి పెరుగుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) మాజీ చైర్మన్, తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వర్గంలో తీవ్ర అసహనం నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# అసహనంలో కోదండరాం బ్యాచ్!

### కాంగ్రెస్ సర్కారులో తగిన గుర్తింపు లేదనే భావన?

### ఎమ్మెల్సీ పదవి తప్ప టీజేఎస్‌కు దక్కని ప్రాధాన్యం

### ఉద్యమకారుల కమిటీలో సభ్యుడిగానే పరిమితం కావడంపై అసంతృప్తి

తెలంగాణ ఉద్యమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని ముందుకు నడిపించిన నాయకుల్లో కోదండరాం పేరు ముందువరుసలో ఉంటుంది. రాష్ట్ర విభజన ఉద్యమ సమయంలో టీజేఏసీకి నాయకత్వం వహించిన ఆయనను ఉద్యమానికి "మేధో శక్తి"గా పలువురు అభివర్ణించారు.

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న మేధావులు, ప్రజా సంఘాలు, ఉద్యమకారులను సమీకరించడంలో కోదండరాం కీలక పాత్ర పోషించినట్లు అప్పట్లో రాజకీయ వర్గాలు విశ్లేషించాయి. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యక్షంగా కాకపోయినా, బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు ఏకీకరణలో ఆయన పాత్ర ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోదండరాంకు, ఆయన పార్టీకి తగిన ప్రాధాన్యం లభిస్తుందనే అంచనాలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కోదండరాంకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా ఆయనకు రాజకీయ గుర్తింపు ఇచ్చినప్పటికీ, తెలంగాణ జన సమితికి చెందిన ఇతర నాయకులకు ప్రభుత్వం లేదా నామినేటెడ్ పదవుల్లో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఉద్యమ సమయంలో పనిచేసిన తమకు కనీస ప్రాధాన్యం కూడా దక్కలేదనే భావన టీజేఎస్ శ్రేణుల్లో వ్యక్తమవుతోందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీలో కూడా కోదండరాంకు చైర్మన్ బాధ్యతలు కాకుండా సభ్యుడి హోదా మాత్రమే తరువాయి 2 వ పేజీలో...



(ఫైల్ ఫొటో)

# తెలంగాణ తల్లికి కోదండరాం నివాళి

ఇటీవల మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశానికి హాజరైన టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చేసింది.

ఉద్యమ కాలం నుంచి ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాదని కొత్తగా రూపం ఇచ్చింది. దీనిపై తెలంగాణలో అనేక వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, రేవంత్ సర్కారు నిర్ణయాన్ని కోదండరాం వెనకేసుకొచ్చారు. 'తెలంగాణ తల్లి విగ్రహం మన పోరాటాలకు వారసత్వంగా కనిపిస్తూ ఉంది. తెలంగాణ తల్లిని తొలుత ఇదే రూపంలో రూపొందించాం. నిరాడంబరంగా, మన సంస్కృతికి, త్యాగాలకు ప్రతిరూపంగా ఉంది. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, అమ్మవార్ల విగ్రహాలకు ప్రతీకగా నిలుస్తోంది. మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తోంది. ఇంత మంచి విగ్రహం రూపొందించి కళాకారులకు, ప్రతిష్ఠిస్తున్నందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నాను' అని అప్పట్లో పేర్కొన్నారు. అయితే, ఆయనే.. తాజాగా, మునుపటి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేయడం గమనార్హం. దీనిపై నెట్టింట జోరు చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించిన చిత్రాన్ని బీఆర్ఎస్ శ్రేణులు షేర్ చేస్తూ, అసలైన ఉద్యమకారులకు తెలంగాణ తల్లి ఎట్లుంటదో తెలుసు అంటూ కామెంట్లు చేస్తున్నాయి.

# ఉద్యమకారుల సంక్షేమానికి కార్పొరేషన్

### డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ముఖాముఖీ

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) ఆధ్వర్యంలో డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ప్రత్యేక ముఖాముఖి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద జరిగింది. ఉద్యమకారుల సంక్షేమానికి శాశ్వత కార్పొరేషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలని సమావేశంలో ప్రధానంగా డిమాండ్ చేశారు.

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, అద్దంకి దయాకర్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ అల్లం నారాయణ, అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ ఎం. రాజేందర్ రెడ్డి, -2 వ పేజీలో...



# ఎవరు ఉద్యమకారులు?

### గుర్తింపునకు గీటురాయి ఏది

### కొద్దిమందికే గుర్తింపు ఎందుకు

### తెలంగాణ సమాజానికి గౌరవం వద్దా

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియపై రాష్ట్రంలో కొత్త చర్చ మొదలైంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తున్న వేళ, అసలు "ఉద్యమకారుడు ఎవరు?", ఉద్యమంలో పాల్గొన్న వారిని ఎలా గుర్తిస్తారు?" అనే ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమం అంటే కేవలం రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు, లాఠీచార్జీలు ఎదుర్కొన్న వారితో మాత్రమే పరిమితమా? లేక ఉద్యమ విజయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన ప్రతి తెలంగాణ బిడ్డ ఉద్యమకారులు కారా? అనే తరువాయి 2 వ పేజీలో...



# మోదీ ఇంటి వద్ద హైడ్రామా

### నీట్ వివాదంపై కాంగ్రెస్ నిరసన.. ఆందోళనలో రాహుల్, ప్రియాంక

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

న్యూఢిల్లీ: ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్



# ఎఫ్‌టీఎల్‌లోనే పవన్ భూమి


### హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జన్వాడ కోడి చెరువు భూమి వ్యవహారంపై స్పందించిన హైడ్రా కమిషనర్అందులో.. పవన్ పేరిట ఉన్న భూమిలో 6, 7 ఎకరాలు చెరువు ప్రాంతంలోనే, ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్)లో ఉన్నాయని వెల్లడించారు. పవన్ ఇక్కడ 2014లో భూమి కొన్నారని, అయితే అందులో 3, 4 ఎకరాలు మాత్రమే ఎఫ్‌టీఎల్ బయట ఉన్నాయని స్పష్టం చేశారు. '2014లోనే పవన్ కళ్యాణ్ జన్వాడలో సుమారు 10 ఎకరాల భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత 2016-17లో జరిగిన రీ మార్కింగ్ ప్రక్రియలో ఆ భూమిలో

# వార్డుల విభజన తర్వాతే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు

### డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్ వద్దు: హైకోర్టు

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై తాజాగా తెలంగాణ హైకోర్టు బ్రేక్ వేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా తిరిగి నిర్ధారించే వరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామంతో జీహెచ్ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌పై అనిశ్చితి నెలకొంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ తరువాయి 2 వ పేజీలో...



# సెప్టెంబర్ 15లోగా వచ్చేయండి



### భారతీయ విద్యార్థులకు అమెరికా వర్సిటీల సూచన

### వీసా కొత్త నిబంధనల వల్లేనన్న విశ్లేషకులు

న్యూయార్క్: భారతీయులు సహా విదేశీ విద్యార్థులు తమ సొంతదేశానికి వెళ్లినట్టయితే.. ప్రస్తుతం ఉన్న ఇమ్మిగ్రేషన్ నిబంధనల ప్రయోజనాలను కొనసాగించడానికి సెప్టెంబరు 15 నాటికి తిరిగి వచ్చేయాలని అమెరికాలోని యూనివర్సిటీలు సూచించాయి. ప్రస్తుతం అమలులో ఉన్నడ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ విధానాన్ని రద్దు చేస్తూ.. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ సరికొత్త నిబంధనలు తీసుకురానున్న నేపథ్యంతో ఎఫ్, జే వీసాదారులకు ఈ హెచ్చరికలు జారీ చేశారు. తాజా నిబంధన ప్రకారం విదేశీ విద్యార్థులు గరిష్ఠంగా నాలుగేళ్ల కాలానికి మాత్రమే అమెరికాలో నివసించేందుకు తరువాయి 2 వ పేజీలో...



# టీచర్లకు టెట్

### నోటిఫికేషన్ విడుదల

### నేటి నుంచి దరఖాస్తులు

### సెప్టెంబర్‌లో పరీక్షలు

## రాశి ఫలాలు

22.7.2026

**మేషం:** చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసికంగా సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. ఆర్థికంగా స్థిరత్వం ఉండదు. వృత్తి ఉద్యోగ విషయంలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వ్యాపారాలు మందగిస్తాయి.

**వృషభం:** సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ధనాదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయగలుగుతారు. దూరప్రాంత బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపార వ్యవహారాలలో భాగస్థులతో సమస్యలను సర్దుబాటు చేసుకుంటారు.

**మిధునం:** అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. చేపట్టిన పనులలో ఎంత కష్టపడినా ఫలితం అంతంత మాత్రంగా ఉంటుంది. కొన్ని వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాతో ముందుకు సాగడం మంచిది. వృత్తి వ్యాపారాల్లో స్వల్ప లాభాలు అందుకుంటారు. ఉద్యోగ విషయంలో తొందరపాటు మంచిది కాదు.

**కర్కాటకం:** ముఖ్యమైన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. దూర ప్రయాణాలు కలసివస్తాయి. నిరుద్యోగులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

**సింహం:** ముఖ్యమైన పనులు వ్యయ ప్రయాసలతో కానీ పూర్తికావు. ఆర్థిక పరంగా ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య:** ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో ఉన్నత హోదాలు పొందుతారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన సకాలంలో పూర్తిచేస్తారు. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల:** వృత్తి ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో తొందరపాటు మంచిది కాదు. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

**వృశ్చికం:** కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. దైవసేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృత్తి, ఉద్యోగములు అంతంత మాత్రంగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ధనపరంగా ఒడిదుడుకులు ఉంటాయి. పనులు సకాలంలో పూర్తి కావు.

**ధనస్సు:** వాహన ప్రయాణ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. అకారణంగా ఇతరులతో వివాదాలు కలుగుతాయి. ఋణ సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగస్తులకు ఆకస్మిక స్థానచలన సూచనలు ఉన్నవి. సంతాన విద్యా విషయంలో దృష్టి సారించడం మంచిది. చేపట్టిన పనులలో ఆటంకాలుంటాయి.

**మకరం:** కుటుంబ సభ్యుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక ఋణాల వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుతుంది. వృత్తివ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగమున అదనపు పనిభారం నుండి ఉపశమనం పొందుతారు. సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో మనస్పర్దలు సద్దుమణుగుతాయి. విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణత సాధిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. వివాహాది శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** ఇతరులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో స్వల్ప ఇబ్బందులు ఉంటాయి. వ్యాపార పరంగా ఒత్తిడి తప్పదు. కుటుంబ పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు కొంత అనుకూలంగా సాగుతాయి. నూతన ఋణ యత్నాలు చేస్తారు.

# అసహనంలో కోదండరాం బ్యాచ్!

మొదటి పేజీ తరువాయి

ఇవ్వడం ఆయన అనుచరులను నిరాశకు గురిచేసిందని సమాచారం. తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన వ్యక్తిని ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు నాయకత్వం వహించే చైర్మన్‌గా నియమిస్తారని ఆశించినా, ఆ స్థాయి బాధ్యత రాకపోవడం తమ నాయకుడి సేవలకు తగిన గౌరవం కాదనే అభిప్రాయం టీజేఎస్ వర్గాల్లో వినిపిస్తోంది. వాస్తవానికి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారి వివరాలు, వివిధ దశల్లో జరిగిన పోరాటాలపై కోదండరాంకు సమగ్ర అవగాహన ఉందని, అలాంటి వ్యక్తి చైర్మన్‌గా ఉంటే కమిటీ మరింత విశ్వసనీయంగా పనిచేసేదని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు.

మేధావుల పట్ల నిర్లక్ష్యం?

తెలంగాణ ఉద్యమంలో రాజకీయ నాయకులతో పాటు మేధావులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాజకీయ అవసరాలకే అధిక ప్రాధాన్యం లభిస్తోందే తప్ప, ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన నాయకులకు తగిన స్థానం కల్పించడం లేదనే విమర్శలు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. కోదండరాం విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆయనకు వ్యక్తిగతంగా ఎమ్మెల్సీ పదవి లభించినప్పటికీ, ఆయనతో కలిసి పనిచేసిన ఉద్యమ నాయకులకు అవకాశాలు లేకపోవడం అసంతృప్తికి కారణమైందని అంటున్నారు. ప్రస్తుతం కోదండరాం బహిరంగంగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయకపోయినా, టీజేఎస్ శ్రేణుల్లో పెరుగుతున్న అసంతృప్తి భవిష్యత్‌లో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు లేదా ఇతర రాజకీయ పరిణామాల సమయంలో ఈ వర్గం ఎలాంటి వైఖరి అవలంబిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# టీచర్లకు టెట్



### నోటిఫికేషన్ విడుదల
### నేటి నుంచి దరఖాస్తులు
### సెప్టెంబర్‌లో పరీక్షలు

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ శుభవార్త తెలిపింది. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీటెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించేందుకు ప్రత్యేకంగా ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో ఉపాధ్యాయుల అర్హతలు, భవిష్యత్ ప్రమోషన్ల కోసం ఈ టెట్ కీలకంగా మారింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 22వ తేదీ నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ టెట్ పరీక్షలను సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నారు. ఆగస్ట్ 31వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ టెట్‌ను 2 పేపర్లుగా నిర్వహిస్తారు. పేపర్-1ను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు బోధించే సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు), ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల కోసం నిర్వహించనున్నారు. మరోవైపు.. పేపర్-2ను 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు, టీజీటీలు, లాంగ్వేజ్ పండిట్లు, హైస్కూల్ హెచ్ఎంల కోసం నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో 150 మార్కులకు 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఎలాంటి నెగెటివ్ మార్కులు ఉండవు. ఇక పరీక్ష ఫీజుల విషయానికి వస్తే జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ.750.. రెండు పేపర్లకు రూ.1000 నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ.700.. రెండు పేపర్లకు రూ.950గా నిర్ణయించారు. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 60 శాతం.. బీసీలు 50 శాతం.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 40 శాతం మార్కులు సాధిస్తే ఈ టెట్‌లో ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. ఈ టెట్‌లో పొందిన అర్హత వారు.. భవిష్యత్తులో నిర్వహించే డీఎస్సీ లేదా ఇతర ప్రత్యక్ష నియామకాలకు వర్తించదని విద్యాశాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల కోసం మాత్రమే ఈ ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. మరిన్ని వివరాలకు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# వార్డుల విభజన తర్వాతే జీహెచ్ఎంసీ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. 1996 జీవో నంబర్ 570లోని రూల్-5 ప్రకారం జనాభా ప్రాతిపదికనే వార్డుల డీలిమిటేషన్ జరగాలని.. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలను పాటించలేదని పిటిషనర్లు వాదించారు. అలాగే తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్-2019లోని సెక్షన్-6 ప్రకారం ప్రజల అభ్యంతరాలు స్వీకరించి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా.. ఆ నిబంధనలను కూడా ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం, పిటిషనర్ల తరపు లాయర్లు వాదనలు విన్న హైకోర్టు.. ప్రాథమికంగా పిటిషన్‌లో ఉన్న అంశాలను పరిశీలించింది. తదుపరి విచారణ పూర్తి అయ్యే వరకు వార్డుల సరిహద్దులను చట్టబద్ధంగా పునర్నిర్ణయించాలని.. అప్పటివరకు జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయరాదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు నిర్ణయంతో జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం అవుతున్న రాజకీయ పార్టీల వ్యూహాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియను ఎలా సమర్థించుకుంటుంది.. తదుపరి విచారణలో ఎలాంటి ఆధారాలు సమర్పిస్తుంది అనే అంశాలపై ఎన్నికల భవిష్యత్తు ఆధారపడనుంది. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే అవకాశం లేదని న్యాయ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# 18 ఏళ్లు నిండితే ఏంటి..

మొదటి పేజీ తరువాయి

మహిళల రక్షణ చట్టం-2005 లోని సెక్షన్ 20(డి)ని హైకోర్టు లోతుగా విశ్లేషించింది. చట్టంలోని 'ఆర్థిక సహాయం' అనేది కేవలం ప్రాథమిక జీవన భరణానికి (తిండి, బట్ట) మాత్రమే పరిమితం కాదని, కేసు వాస్తవాలను బట్టి ఉన్నత విద్యా ఖర్చులకు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొంది. కుమార్తె తన మొదటి ఏడాది ఫీజు కోసం తాతగారి వద్ద రూ. 14 లక్షలు అప్పు తీసుకున్న విషయాన్ని, ఆమెకు స్వతంత్ర ఆదాయం లేకపోవడాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన 'నీలిమా చౌరే' తీర్పును ఉటంకిస్తూ.. పిల్లలు చదువుకోవడానికి చట్టబద్ధమైన హక్కు ఉందని, స్థోమత ఉన్న తల్లిదండ్రులు ఆ ఖర్చులను కచ్చితంగా భరించాలని తేల్చిచెప్పింది. వయోజనురాలైనంత మాత్రాన ఒక కూతురికి చదువుకునే హక్కు రద్దయిపోదని స్పష్టం చేస్తూ కింది కోర్టుల ఆదేశాలను హైకోర్టు సమర్థించింది.

# మోదీ ఇంటి వద్ద హైడ్రామా

మొదటి పేజీ తరువాయి

ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది.

# ఎవరు ఉద్యమకారులు?

మొదటి పేజీ తరువాయి

చర్చ మేధావులు, ఉద్యమ వర్గాల్లో మెదులుతోంది. ఉద్యమ సమయంలో విద్యార్థుల్లో తెలంగాణ చైతన్యాన్ని పెంపొందించిన ఉపాధ్యాయులు, ఉద్యమ స్ఫూర్తిని బోధించిన అధ్యాపకులు, పాటలు, కవితలు, రచనల ద్వారా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, ఉద్యమకారులకు సద్ది పెట్టి పంపిన తల్లులు, చెల్లెళ్లు, భార్యలు, కుటుంబసభ్యులు... వీరి పాత్ర చిన్నదేం కాదు కదా? వీళ్లను ఉద్యమకారులుగా ఎందుకు గుర్తించరు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాదు, విధి నిర్వహణలో భాగంగా ఉద్యమకారులపై చర్యలు తీసుకోవాల్సి వచ్చినా, మనస్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు మద్దతు తెలిపిన పలువురు పోలీసులు కూడా మానసికంగా తీవ్ర వేదన అనుభవించారని అప్పట్లో చర్చ జరిగింది. అలాంటి వారు ఉద్యమకారులు కారా? అన్న అభిప్రాయం వస్తోంది. తెలంగాణ ఉద్యమం ఒక్క సంఘటన కాదు, దాదాపు ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమం. ఈ ప్రయాణంలో గ్రామాలు, పట్టణాలు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, కళాకారులు, రచయితలు, న్యాయవాదులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాలు... ఇలా సమాజంలోని దాదాపు ప్రతి వర్గం ఏదో ఒక రూపంలో భాగస్వామ్యమైంది. ఈ నేపథ్యంలో, కేవలం నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా కొద్దిమందికి మాత్రమే ఉద్యమకారుల గుర్తింపు ఇవ్వడం సమంజసమేనా? అన్న అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉద్యమకారుల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం అర్హత ప్రమాణాలు నిర్ణయించడం ఒక పరిపాలనా అవసరం కావొచ్చు. అయితే తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఎవరి పాత్రను చిన్నచూపు చూడకుండా, ఉద్యమానికి వివిధ రూపాల్లో సేవలందించిన వర్గాలందరికీ తగిన గౌరవం లభించే విధంగా విధానాలు ఉండాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్ర సాధన అనేది కొద్దిమంది కృషి ఫలితం మాత్రమే కాదని, ప్రతి తెలంగాణ పల్లె, ప్రతి గల్లీ, ప్రతి కుటుంబం ఆ ఉద్యమంలో ఏదో ఒక రూపంలో భాగస్వామ్యమైందనేది నిజం. అందువల్ల ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత, సమగ్రత, విస్తృత సంప్రదింపులు అవసరమని పలువురు సూచిస్తున్నారు. ఉద్యమకారుడు అంటే లాఠీ దెబ్బలు తిన్నవాడేనా? లేక తెలంగాణ కోసం తనవంతు పాత్ర పోషించిన ప్రతి ఒక్కరా? అనే ప్రశ్నకు సమాధానం దొరికినప్పుడే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పూర్తి న్యాయం జరిగినట్లవుతుందనే అభిప్రాయం వస్తోంది.

# ఎఫ్‌టీఎల్‌లోనే పవన్ భూమి

మొదటి పేజీ తరువాయి

సుమారు 6 ఎకరాల నుంచి 7 ఎకరాల భూమి.. కోడి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చినట్లు గుర్తించారు. మిగిలిన 3 ఎకరాల నుంచి 4 ఎకరాలు మాత్రం ఎఫ్‌టీఎల్ వెలుపల ఉన్నాయి. చెరువు పరిధిలో పట్టా భూములు ఉండటం అసాధారణం కాదు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. అలాంటి భూముల్లో వ్యవసాయం చేయవచ్చు. అయితే చెరువును దెబ్బతీసే నిర్మాణాలు, నీటి ప్రవాహాన్ని అడ్డుకునే పనులు చేయకూడదు. ఈ భూమిలో పవన్ కల్యాణ్ అలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదు. పవన్ కల్యాణ్ చేసిన తప్పు ఏదైనా ఉందంటే చెరువు పరిధిలో కంచె ఏర్పాటు చేయడమే. రువు పరిధిలో ఫెన్సింగ్ చేయకూడదని.. అయితే దానికి తప్ప చెరువును పూడ్చివేయడం, మట్టి నింపడం లేదా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఆధారాలు లేవు' అని స్పష్టం చేశారు. తమ విచారణలో కోడి చెరువులో మట్టి నింపడం, నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలకు పక్కనే ఉన్న ఇతర భూయజమానులే కారణమని గుర్తించినట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. ఆ ఉల్లంఘనలపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పవన్ కల్యాణ్ భూమిలో మాత్రం అలాంటి చర్యలు జరగలేదని స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 15లోగా వచ్చేయండి

మొదటి పేజీ తరువాయి

అనుమతి ఉంటుంది. 'ఈ కొత్త చట్టం అమలులోకి రావడానికి 60 రోజుల వ్యవధి ఉంది.. సెప్టెంబర్ 8, 2026న తరగతులు ప్రారంభమయ్యే లోపే విద్యార్థులందరూ న్యూయార్క్ చేరుకోవాలని సూచిస్తున్నాం' అని కొలంబియా యూనివర్సిటీ తన నోటీసులో పేర్కొంది. ఎఫ్-1 స్టూడెంట్ వీసా, జే-1 ఎక్స్ఛేంజ్ విజిటర్స్ వీసా, విదేశీ జర్నలిస్టులకు ఉద్దేశించిన ఐ వీసా హోల్డర్ల నివాస కాలాన్ని గరిష్ఠంగా నాలుగేళ్లకు పరిమితం చేస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ కఠిన నిబంధనలను ఖరారు చేసింది. ఈ నిర్ణయం లక్షలాది మంది భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ నిబంధన ప్రకారం.. చదువు పూర్తయిన తర్వాత ఇచ్చే గ్రేస్ పీరియడ్‌ను 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. అంతేకాకుండా, ఏ పొడిగింపు కోసమైనా విద్యార్థులు ఫారం ఐ-539 ద్వారా అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధన సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రస్తుత విధానం ప్రకారం ఎఫ్-1 విద్యార్థులు తమ అకడమిక్ స్టేటస్‌ను కొనసాగించినంత కాలం అమెరికాలో నివసించడానికి అనుమతి ఉంటుంది.

# ఉద్యమకారుల సంక్షేమానికి కార్పొరేషన్

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు మాజీ అధ్యక్షుడు ఎస్. సత్యం రెడ్డి సహా వివిధ వర్గాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత సమావేశంలో పాల్గొని ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపుకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన చారిత్రక జీవోల ప్రతులను కమిటీకి అందజేస్తూ, జార్ఖండ్ సహా ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి తెలంగాణలో అర్హుల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, జార్ఖండ్‌లో అమలైన విధానాలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తెలంగాణ ఉద్యమకారులకు అంతకంటే మెరుగైన విధానంతో న్యాయం చేస్తామని తెలిపారు.

అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో జర్నలిస్టులు, అడ్వకేట్లు, డాక్టర్ల జేఏసీలు తమ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకెళ్లాయి. తెలంగాణ మీడియా సంస్థల రక్షణకు ప్రత్యేక నిధులు, జర్నలిస్టులకు 250 గజాల ఇంటి స్థలం, ఉచిత రవాణా, పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్య, ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేయాలని జర్నలిస్టుల జేఏసీ కోరింది. అడ్వకేట్లకు శాసన మండలిలో ప్రత్యేక ఎమ్మెల్సీ స్థానం కల్పించాలని అడ్వకేట్ జేఏసీ డిమాండ్ చేయగా, ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్లకు ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం, ప్రభుత్వ బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్యం, అధికారిక గుర్తింపు కార్డులు, ఆయుష్ ఆసుపత్రుల విస్తరణ చేపట్టాలని డాక్టర్ల జేఏసీ విజ్ఞప్తి చేసింది. అలాగే ఉద్యమకారుల సంక్షేమం కోసం శాశ్వత కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, గుర్తింపు ప్రక్రియకు నిర్దిష్ట కాలపరిమితి నిర్ణయించాలని ప్రతినిధులు కోరారు. సమావేశం ముగింపులో కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రతి డిమాండ్‌ను పరిశీలించి, డిజిటల్ ఆధారాలతో ఎవరికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, అన్ని విజ్ఞప్తులను క్రోడీకరించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.

# నా కొడకా.. తీసుకో రక్తం!

**కానీ రైతులకు నీళ్లు ఇవ్వు.. మాది ఏ జాతి అంటావా?.. వలస పాలకుల సంక నాకే జాతి కాదు.. పోరంబోకు జాతి అసలే కాదు..లక్షేటిపేటలో కేటీఆర్ మాస్ కౌంటర్**

లక్షేటిపేట, జూలై 21 (ఈవార్తలు): తెలంగాణ రైతులు నీళ్లు అడిగితే.. పొలాల్లో బీఆర్ఎస్ నేతల రక్తం చల్లాలని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారని "రక్తం చల్లుమంటావా నా కొడుకా... తీసుకో, కానీ రైతులకు నీళ్లు ఇవ్వు!" అని తీవ్రంగా విరుచుకుపడ్డారు. లక్షేటిపేట రైతు సదస్సులో కేటీఆర్ ప్రసంగించారు. గోదావరి నీళ్లు ఏపీకి తరలిపోతుంటే, పట్టిసీమ నడుస్తుంటే ఇక్కడ పట్టించుకోరా? మాట మాట్లాడితే 'ఏ జాతి నీది' అని అడుగుతారా? మాది పోరంబోకు జాతి కాదు.. వలసపాలకుల సంక నాకే దగుల్బాజీ జాతి అసలే కాదు అని గట్టికౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. యువత , రైతాంగం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. 31 నెలల పాలనలోనే కాంగ్రెస్ మార్క్ ఫ్లాప్ సినిమాగా తేలిపోయిందని, మిగిలిన 29 నెలల్లో ప్రజలే కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టి, కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ రైతు ప్రభుత్వాన్ని పునరుద్ధరించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల బీఆర్ఎస్ కార్యకర్తలను, ప్రజలను వేధించే అధికారులను, పోలీసులను అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. కాంగ్రెస్ తెచ్చిన కృత్రిమ కరువు వల్ల రాష్ట్రంలో రైతులు అల్లాడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, పంట కొనుగోలు కేంద్రాల నిర్వహణ లోపం వల్ల ఆవేదనతో నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ 8 గంటల పాటు ధర్నా చేసినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం కిరాతక పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. యూరియా కొనుగోలుకు కూడా యాప్‌ల పేరిట నిబంధనలు పెట్టి రైతులను షాపుల ముందు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని కేటీఆర్



తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద రెండు పిల్లర్లు కుంగితే, కేవలం 400 కోట్లతో 36 నెలల్లో పునరుద్ధరించే అవకాశం ఉన్నప్పటికీ కావాలనే రాజకీయ కక్షతో పనులు ఆపేశారని ఆరోపించారు. కన్నెపల్లి వద్ద 94 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహిస్తున్నా, పంపులు ఆన్ చేస్తే ఎల్లంపల్లికి నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను సమన్వయంతో నడిపిస్తే రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని, కన్నెపల్లి పంపులు ఆన్ చేయవద్దని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదని ఆయన గుర్తుచేశారు. వరసగా నాలుగు సార్లు రైతుబంధు నిధులను ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డి సర్కార్‌దేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దిల్లీలో వేలాది మంది విద్యార్థులు, యువత తమ ఆకాంక్షల కోసం పార్లమెంట్ ముందు నిలబడి కేంద్రాన్ని గడగడలాడించిన దృశ్యాలను చూశామని, తెలంగాణలోనూ రేవంత్ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని హెచ్చరించారు. యువత, రైతులు తిరగబడి కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ నాయకులు బయట కూడా తిరగలేరని స్పష్టం చేశారు. ఉడుకు నెత్తురు ఉన్న తెలంగాణ యువత, ఆక్రోశంలో ఉన్న రైతాంగం కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్, బీజేపీలను తన్ని తరిమే రోజులు త్వరలోనే వస్తాయని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ రహిత పాలన, రైతు సంక్షేమం మళ్లీ సాకారమవ్వాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని మంచిర్యాల వేదికగా కేటీఆర్ పిలుపునిచ్చారు.

## రాజకీయ నాటకాలు వద్దు

**కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**



హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు. సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పుదుచ్చేరి వంటి అనేక రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైకోర్టుకు ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

**క్వాష్ పిటిషన్ దాఖలు**

**తనపై ఆరోపణలు ఖండన**

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో, తీవ్ర వివాదంలో చిక్కుకున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టనుంది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డిపై ఓ ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి తీవ్ర ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని, అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, తనపై వివాహేతర సంబంధాలు అంటగడుతూ ప్రచారం చేయడం, ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వ్యక్తిగత సందేశాలు చూడటం, ప్రైవేట్ వీడియోలు తీసి వాటిని తన భర్తకు పంపి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఉదయ్ కృష్ణారెడ్డి మొదటి నుంచి ఖండిస్తున్నారు. అవన్నీ నిరాధారమైనవని, తామిద్దరం పరస్పర అంగీకారంతో 2025 జూన్ నుంచి రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన వాదిస్తున్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా ఈ సంబంధం కొనసాగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ ఘటన తర్వాత ఆయన్ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్‌గా పనిచేసి, పట్టుదలతో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్ అధికారిగా ఎంపికైన స్ఫూర్తిదాయక నేపథ్యం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు దశలో ఉండగా, పోలీసులు ఇరువర్గాల వాదనలను, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది.

## ఉత్తమ్ మాటలు నమ్మి మోసపోయారు

**దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులకు తీవ్ర నష్టం.. మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం**



హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

## టెన్సింగ్ నార్కే జాతీయ సాహస పురస్కారానికి నామినేషన్లు

**ఆగస్టు 20 వరకు దరఖాస్తులు.. విజేతలకు 15 లక్షల నగదు**

న్యూఢిల్లీ, జూలై 21 (పీఐబీ): యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక టెన్సింగ్ నార్కే జాతీయ సాహస పురస్కారం--2025 కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్ల స్వీకరణను ప్రారంభించింది. సాహసిక కార్యకలాపాల రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన భారతీయులకు అందించే ఈ అత్యున్నత జాతీయ పురస్కారానికి దరఖాస్తులను జూలై 21 నుంచి ఆగస్టు 20, 2026 వరకు స్వీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ పురస్కారాలు భూమి, జలం (సముద్రం), నింగి (వాయు) సాహసిక కృత్యాలు, అలాగే జీవన సాఫల్యం అనే నాలుగు విభాగాల్లో ప్రదానం చేస్తారు. సాహసిక రంగంలో అసాధారణ విజయాలను గుర్తించడం, యువతలో ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తిని ప్రోత్సహించడం ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. విజేతలకు కాంస్య ప్రతిమ, ప్రశంసా పత్రం, బ్లేజర్ (లేదా చీర), పట్టు టైతో పాటు రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. ఈ పురస్కారం ప్రతిష్ఠ పరంగా అర్జున అవార్డు స్థాయికి సమానమైనది. సాహసిక రంగంలో విశిష్ట సేవలు అందించిన భారతీయ పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ యువజన లేదా క్రీడల శాఖ, గుర్తింపు పొందిన సాహసిక సంస్థల సిఫారసుతో నామినేషన్లు సమర్పించాలి. సైన్యం, నౌకాదళం, వైమానిక దళానికి చెందిన అభ్యర్థులకు సంబంధిత శాఖల సిఫారసు తప్పనిసరి. దరఖాస్తుదారులు తమ విజయాలను కాలక్రమానుసారంగా వివరించి, అవసరమైన ఆధార పత్రాలను ఒకే పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాలి. భూమి, జల, వాయు విభాగాల్లో గత మూడు క్యాలెండర్ సంవత్సరాల్లో సాధించిన విజయాలను ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు జాతీయ పురస్కారాల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రిత్వ శాఖ సూచించింది.

## ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి

**బీసీ గురుకులాలపై మంత్రి పొన్నం ఆదేశాలు**

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల వసతులపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన నిబంధనలు విధించారు. బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో (ఆర్‌సీవో) కీలకమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన... రాబోయే ఆగస్టు 30వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి తనిఖీలను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధివిధానాల్లో భాగంగా ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను నేరుగా సందర్శించాలని మంత్రి ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, స్వయంగా తాను కూడా ప్రతి నెలా కనీసం 15 గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తూ, ఒత్తిడి తగ్గించేందుకు సైకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మరొక వైపు సొంత భవనాలు లేని గురుకులాలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మూసీ గురుకులానికి సొంత భవన నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు కేటాయించే నిధుల్లో ఆరు శాతాన్ని అత్యవసర మరమ్మతులకు వినియోగించుకునేలా అనుమతించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గురుకులంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతలను కూడా వారికి అప్పగించాలని ఆర్‌సీవోలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్‌కు చెందిన కుటుంబంలో ముగ్గురి మృతి**

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): అమెరికాలో జరిగిన ఒక ఘోర ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద వార్త తెలియడంతో వారి బంధువర్గం, తెలుగు ఎన్నారై సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, అమెరికాలోని కాలిఫోర్నియాలో చోటుచేసుకున్న ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అధికారులు, భారత రాయబార కార్యాలయం అధికారులు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పురా ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వాణి నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ నవీద్ గతంలో నగరంలోని ఒక ప్రముఖ ఫార్మా ల్యాబ్‌లో పని చేశారు. ఇటీవల అమెరికాలోని మెర్క్ ఫార్మా కంపెనీలో ఉద్యోగం రావడంతో ఆయన తన కుటుంబంతో సహా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో నవీద్ భార్య నజియా (45), కుమార్తె హాఫీజా షేక్ (19), కుమారుడు హాఫీజ్ ఒమర్ (14) మృతి చెందారు. నవీద్‌తో పాటు ఆయన చిన్న కూమార్తె తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు నవీద్ నివాసానికి చేరుకున్నారు.

## రౌడీ షీటర్ సూరి దారుణ హత్య

మీర్‌పేట-హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తీవ్ర కలకలం చోటుచేసుకుంది. పాత నేరస్థుడైన నందనవనం సూరిని ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మీర్‌పేట్‌లోని టీకేఆర్ కళాశాల సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో సూరి చేతిలో హత్యకు గురైన వ్యక్తి సోదరుడు అఫ్రోజ్, పక్కా పథకం ప్రకారం సూరిని అక్కడికి రప్పించాడు. సూరి రాగానే, దుండగులు తొలుత అతని కళ్లలో కారం పొడి చల్లి ప్రతిఘటించకుండా చేశారు. అనంతరం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో సూరి అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు సూరిపై గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. తన భార్యతో పాటు బావమరిది సల్మాన్‌ను హత్య చేసిన కేసులో అతను ప్రధాన నిందితుడు. అతని నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు కొన్ని నెలల క్రితమే అతడిని నగరం నుంచి బహిష్కరించారు.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఎన్యూమరేషన్‌కు ఆధార్ తప్పనిసరి కాదు

**తెలంగాణ సీఈవో కీలక ప్రకటన**

హైదరాబాద్, జూలై 21 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా, సుదర్శన్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారాంతం నాటికి జిల్లాల్లో ఓటర్ల గణన ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన ఓటర్లను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తిరిగి భౌతిక పత్రాలు కోరకూడదని, అలాగే ఆధార్ కార్డుల కోసం ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణలో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నీట్ బాధాకరం: రఘునందన్ రావు

మెదక్, జూలై 21 (ఈవార్తలు): నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరమని, అయితే ఈ అంశంపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నీట్‌తో పాటు ఏ ప్రజా సమస్యపై అయినా పార్లమెంట్‌లో సమగ్రమైన సమాధానం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే పార్లమెంట్ సమావేశాలు కేవలం నిబంధనల ప్రకారమే సాగుతాయని, విపక్షాల ఆలోచనలకు అనుగుణంగా జరగవని తేల్చిచెప్పారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసి ఫొటోలు దిగాలనే ఉద్దేశంతోనే విపక్షాలు సభను వాయిదా వేయిస్తున్నాయని ఆయన విమర్శించారు. సభా నిబంధనల ప్రకారం నీట్ అంశంపై చర్చించేందుకు స్పీకర్ అంగీకరించినప్పటికీ, జీరో అవర్‌ను రద్దు చేసి ఇప్పుడే చర్చ పెట్టాలంటూ విపక్షాలు పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇప్పటికే నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించామని గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చట్టసభను ముట్టడిస్తామంటే ఏ ప్రభుత్వమైనా భద్రత దృష్ట్యా నిరసనకారులను అడ్డుకుంటుందని, దానిని వివాదం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. అలాగే అయోధ్య విరాళాల చోరీ ఉదంతంతో బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఈ చోరీ కేసుపై సిట్ లోతుగా విచారణ జరుపుతోందని తెలిపారు.

# వేద పరిరక్షణే ధర్మ పరిరక్షణ: ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, జూలై 21 (ఈవార్తలు): వేదాల పరిరక్షణ ద్వారానే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమవుతుందని, వేద సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర-స్మార్త-ఆగమ విద్వత్ సదస్సు, వేద-స్మార్త పరీక్షా మహోత్సవాల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు, వేద పండితులు స్వస్తివాచనాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. వేద పండితులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేద-స్మార్త పరీక్షా మహోత్సవాలను ప్రారంభించిన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, వేదాలు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. యువతలో వేద విద్యపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 30, 31 తేదీలు, ఆగస్టు 1న నిర్వహించనున్న వరుణ




యాగం ద్వారా రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, లోకశాంతి, లోకకల్యాణం చేకూరాలని స్వామివారిని ప్రార్థించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# కొండగట్టులో వరుణ యాగం

### వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

మల్యాల, జూలై 21 (ఈవార్తలు): రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం వరుణ జపం, వరుణ యాగం వైభవంగా నిర్వహించారు. స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ ప్రసాద్, చిన్న రాము, వేద పండితులు రాజేశ్వర శర్మ, పెద్దన్న శర్మ, తేజ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు అనుకూలంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ వేద మంత్రోచ్చారణల మధ్య వరుణ జపం, యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. అంజనారెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహారనాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.




# మల్యాలలో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి వినతిపత్రం

### ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసిన ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు

మల్యాల, జూలై 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి పెగడపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలని కోరుతూ మల్యాల మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కట్కం వినయ్ కుమార్ స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మల్యాల బస్టాండ్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు ఉన్న రహదారి ఇటీవల కురిసిన వర్షాలతో తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఇదే మార్గంలో పెగడపల్లి మండలానికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నందున ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. సుమారు 2 కిలోమీటర్ల మేర కొత్త ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్, కోరేపు వెంకటేష్, కిషన్ రెడ్డి, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ముగ్గురు అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

కోరుట్ల, జూలై 21 (ఈవార్తలు): వృద్ధులను లక్ష్యంగా చేసుకుని పెన్షన్ పెంపు పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు 24 గ్రాముల బంగారు గొలుసు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా ప్రశాంత్‌నగర్ వొడ్డెర కాలనీకి చెందిన అల్లెపు కృష్ణ (51), కుంచెపు శ్రీకాంత్ (30), అల్లెపు రాజ్‌కుమార్ (28) నిందితులుగా గుర్తించారు. ఈ నెల 15న కోరుట్లకు వచ్చిన వారు లాడ్జిలో బస చేశారు. మరుసటి రోజు బస్టాండ్ వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధురాలిని పరిచయం చేసుకుని, పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచిస్తామని నమ్మించారు. అనంతరం బంగారు ఆభరణాలు ఉంటే పెన్షన్ రాదని చెప్పి, ఆమె మెడలోని సుమారు 24 గ్రాముల లక్ష్మీదేవి బిళ్లల బంగారు గొలుసును తీసుకుని పరారయ్యారు. మరిన్ని నేరాలకు పాల్పడేందుకు లాడ్జిలోనే ఉన్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ప్రధాన నిందితుడు అల్లెపు కృష్ణపై గతంలో 100కు పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రజలు అపరిచితుల మాటలు నమ్మి విలువైన ఆభరణాలను అప్పగించవద్దని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం డయల్-112కు అందించాలని పోలీసులు సూచించారు.

# నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలలో నేడు 'నషా ముక్త్ భారత్ అభియాన్'

నిజామాబాద్, జూలై 21 (పీఐబీ):కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ క్షేత్ర కార్యాలయం, తెలంగాణ పోలీస్ ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 22న (బుధవారం) ఉదయం 10:15 గంటలకు నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రీజినల్ నార్కోటిక్స్ కంట్రోల్ సెంటర్, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎం. సోమనాథం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణలో యువత, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పౌర సమాజం సమిష్టిగా బాధ్యత వహించాల్సిన అవసరాన్ని వివరించనున్నారు. కార్యక్రమంలో నార్కోటిక్ డ్రగ్స్‌కు సంబంధించిన చట్టపరమైన అంశాలు, ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యత, ప్రభుత్వ హెల్ప్‌లైన్లు, వ్యసన విముక్తి, పునరావాస సేవలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. అదనంగా "డ్రగ్ రహిత భారతం సాధించడంలో యువత పాత్ర" అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ 2020లో ప్రారంభించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలవుతోందని, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా యువత ఈ ఉద్యమంలో ముందుండాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ పిలుపునిచ్చింది.

# సర్ అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల, జూలై 21 (ఈవార్తలు): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (సర్)పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్‌కన్నా ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో అవగాహన వాల్ పోస్టర్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనే వారు తమ మొబైల్ ఫోన్ నుంచి 1950 నంబర్‌కు ఈసీఐ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరు గుర్తింపు కార్డు నంబర్‌ను పంపితే తమకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి-శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్



అధ్యక్షుడు కొత్తమోహన్, గట్టు సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాల శరత్, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు దేవనపల్లి రాజేందర్, కార్యదర్శి నాగభూషణం, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పులి నరసయ్య, నాయకులు పంబాల రాము, చీటి లక్ష్మీనారాయణ, చాంద్ పాషా, ఫరూక్, క్రాంతి, పురుషోత్తం, జగన్, అంజన్న, రహీం తదితరులు పాల్గొన్నారు.



# తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి పెట్టాలి

### రైతులకు వ్యవసాయ శాఖ సూచన

వేములవాడ రూరల్, జూలై 21 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో నీటి వనరులు తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వేములవాడ రూరల్ మండల వ్యవసాయ అధికారిణి వినీత సూచించారు. మండలంలోని బొల్లారం, చెక్కపల్లి గ్రామపంచాయతీల పరిధిలోని వట్టెం రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు కంది, రాగి, జొన్న, ఆముదం, ప్రొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. దీంతో సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా, నీటి వినియోగం తగ్గి పంట నష్టాలను కూడా నివారించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో బోర్లు, చెరువుల్లో నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారిణి వినీత, నీటిపారుదల శాఖ ఏఈ, వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, మసూద్ రైతులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# కరువు దెబ్బ.. ఎకరాకు 10 వేలివ్వాలి: బీజేపీ



చందుర్తి, జూలై 21(ఈవార్తలు): కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులను తక్షణమే ఆదుకోవాలని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల సెస్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు అల్లాడి రమేష్ మరియు చందుర్తి మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం మాత్రమే సరిపోదన్నారు. రైతులు వాస్తవంగా సాగు చేయగల పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన పెసర్లు, కందులు, మినుములు, శనగలు వంటి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని, అలాగే రైతులకు ఎకరాకు రూ.10,000 ఆర్థిక సహాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. సాగునీటి నిర్వహణ, విత్తనాల ప్రణాళిక, రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలపై ముందుగానే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉచిత విత్తనాలు, ఆర్థిక సహాయం ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని అల్లాడి రమేష్, మొకిలే విజేందర్ కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాము కాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి



ధర్మపురి, జూలై 21 (ఈవార్తలు): ధర్మపురి పట్టణంలోని దుర్గాకాలనీకి చెందిన ముస్కు లోకేశ్ (4) పాము కాటుకు గురై మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన లోకేశ్‌ను పాము కాటువేసింది. దీంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లోకేశ్ మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ధర్మపురి ఎస్సై గురుక మహేశ్ పరిశీలించారు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్యాస్ కనెక్షన్ పేరు మార్పునకు రూ.వెయ్యి డిమాండ్?


### జాయింట్ కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు

మల్లాపూర్, జూలై 21 (ఈవార్తలు): గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం రూ.వెయ్యి డిమాండ్ చేశారంటూ మల్లాపూర్ మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ కార్యాలయ నిర్వాహకులపై ఓ వినియోగదారు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మండల కేంద్రానికి చెందిన ఏనుగు వెంకట్‌రెడ్డి తండ్రి మృతి చెందడంతో ఆయన పేరుతో ఉన్న గ్యాస్ కనెక్షన్‌ను తన పేరుపై మార్చుకునేందుకు ఈ నెల 18న ఇండియన్ గ్యాస్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వాహకుడు తోట రాజం, అక్కడ విధులు నిర్వహిస్తున్న మరో వ్యక్తి కలిసి రూ.వెయ్యి డిమాండ్ చేశారని వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పేపర్ వర్క్ కోసం డబ్బులు చెల్లించాల్సిందేనని చెప్పినట్లు పేర్కొన్నారు. డబ్బులు చెల్లిస్తే రసీదు ఇవ్వాలని కోరగా రసీదు ఇవ్వలేదని బాధితుడు తెలిపారు. ఈ విషయంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ రాంచందర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# తిరిగి వస్తామంటే నో ఎంట్రీ

### మమత బెనర్జీ స్పష్టీకరణ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పార్టీని వీడి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు 'ఇండియా' కూటమిలోని పక్షాలన్నీ ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. కోల్‌కతాలో మంగళవారం ఓ కార్యక్రమంలో మమత బెనర్జీ మాట్లాడారు. లౌకికవాదాన్ని, సమాఖ్య స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పాలనను కాపాడుకోవడానికి ప్రతిపక్షాల ఐక్యత ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. విపక్ష కూటమిలోని పార్టీలు విభేదాలను పక్కన పెట్టి ఏకం కావాలని పిలుపునిచ్చారు.



## రెండోరోజూ నష్టాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాలతో ముగిశాయి. ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ 238.41 పాయింట్లు కోల్పోయి 77,470.11 వద్ద ముగియగా, నిఫ్టీ 50.80 పాయింట్లు తగ్గి 24,187.70 వద్ద స్థిరపడింది. మరోవైపు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ సూచీలు ఎక్కువగా నష్టపోగా, కెమికల్స్, సిమెంట్ రంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ-50 సూచీలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐషర్ మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ, టీసీఎస్, రియలన్స్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మార్కెట్‌పై భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం కొనసాగుతోందని నిపుణులు పేర్కొన్నారు. అయితే మెరుగైన త్రైమాసిక ఫలితాలపై అంచనాలతో మిడ్‌క్యాప్ కంపెనీల్లో కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. నిఫ్టీకి 24,150-24,100 స్థాయుల వద్ద మద్దతు ఉండగా, 24,300-24,400 స్థాయిలు కీలక నిరోధకంగా మారనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

## భారత్‌లో ఫోల్డబుల్ ఫోన్ల జోరు

**ఈ ఏడాది చివరి 30 లక్షల ఫోన్ల అమ్మకాలు!**

ముంబై: భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో ఫోల్డబుల్ ఫోన్ల శకం వేగంగా విస్తరిస్తోంది. రాబోయే రెండేళ్లలో ఈ విభాగం భారీ వృద్ధిని నమోదు చేయనుందని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2026 చివరి నాటికి భారతదేశంలో ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు 30 లక్షల యూనిట్లను దాటుతాయని ప్రముఖ రీసెర్చ్ సంస్థ 'కౌంటర్‌పాయింట్ రీసెర్చ్' నేడు విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. 2019 నుంచి 2026 మధ్య కాలంలో ఈ మార్కెట్ ఏటా సగటున 80 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తుందని పేర్కొంది. సాధారణ స్మార్ట్‌ఫోన్ల ధరలు డీ-ర్యామ్, న్యాండ్ ఫ్లాష్ మెమరీ వంటి కీలక విడిభాగాల ధరల పెరుగుదలతో అధికమవుతున్నప్పటికీ, ఫోల్డబుల్ ఫోన్ల డిమాండ్ మాత్రం స్థిరంగా కొనసాగుతుందని నివేదిక తెలిపింది. ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్ వినియోగదారులు ధర కంటే కొత్తరకం డిజైన్లు, ఉత్పాదకత, మెరుగైన యూజర్ అనుభవానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సులభమైన ఫైనాన్సింగ్, ఆకర్షణీయమైన ఈఎంఐ పథకాలు కూడా ఈ ఖరీదైన ఫోన్లను కొనుగోలుదారులకు మరింత అందుబాటులోకి తెస్తున్నాయి. భారత ఫోల్డబుల్ మార్కెట్‌లో దక్షిణ కొరియా టెక్ దిగ్గజం శాంసంగ్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని కౌంటర్‌పాయింట్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ ప్రచిర్ సింగ్ తెలిపారు. ఈ రంగంలోకి మొదటగా అడుగుపెట్టడం, నిరంతర ఆవిష్కరణలు, వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనడం వంటి అంశాలు శాంసంగ్‌కు కలిసొచ్చాయని ఆయన వివరించారు. 2026 నాటికి భారత ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లలో దాదాపు 89 శాతం వాటాను శాంసంగ్ కైవసం చేసుకుంటుందని అంచనా వేశారు. ఎనిమిదో తరం గెలాక్సీ 'జెడ్' సిరీస్‌తో పాటు కంపెనీకి ఉన్న నమ్మకమైన కస్టమర్ బేస్ ఇందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

## పికాక్స్ పర్వతం కింద వేల సెంట్రిఫ్యూజ్‌లు

**భయపెడుతున్న ఇరాన్ అణు కార్యక్రమాలు**

టెహ్రాన్: ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత రహస్యంగా కొనసాగిస్తోందని, వేల సంఖ్యలో యురేనియం శుద్ధి చేసే సెంట్రిఫ్యూజ్‌లను అత్యంత సురక్షితమైన భూగర్భ కేంద్రానికి తరలించిందని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వెల్లడించాయి. నతాంజ్ అణు కేంద్రానికి దక్షిణంగా ఉన్న పికాక్స్ పర్వతం ప్రాంతంలో భూమి లోపల ఇరాన్ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అమెరికాకు ఇజ్రాయెల్ సమాచారం అందించింది. గత ఏడాది జూన్‌లో ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య 12 రోజుల పాటు చోటుచేసుకున్న ఉద్రిక్తతల అనంతరం ఈ తరలింపు ప్రక్రియ జరిగినట్లు తెలుస్తోంది. ఆ దాడుల్లో నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలు దెబ్బతినడంతో, కీలక పరికరాలను కాపాడుకునేందుకు ఇరాన్ ఈ చర్యలు చేపట్టింది. ఈ అణు కేంద్రాల్లో యురేనియాన్ని యురేనియం హెక్సాఫ్లోరైడ్‌గా మార్చి, సెంట్రిఫ్యూజ్‌ల ద్వారా ఇరాన్ శుద్ధి చేసింది. అయితే అది ఇప్పటికీ వాయు రూపంలోనే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అణుబాంబు తయారీకి ఈ వాయువును లోహంగా మార్చాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇరాన్ వద్ద ప్రస్తుతం ఉన్నాయా అనే దానిపై స్పష్టత లేదు.

## ఆగస్టు నుంచి మారుతి ధరల పెంపు

**అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెంపు**

ముంబై: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. 2026 ఆగస్టు నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని, ప్యాసింజర్ వాహనాల ధరలు గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెరగనున్నాయని మంగళవారం వెల్లడించింది. ముడిసరుకుల వ్యయం స్థిరంగా పెరుగుతుండటం, అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ మేరకు బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)కి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో మారుతి సుజుకి ఈ వివరాలను పొందుపరిచింది. పెరిగిన ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి అంతర్గతంగా అనేక చర్యలు చేపట్టినా, తప్పనిసరి పరిస్థితుల్లో కొంత భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు వివరించింది. "గత కొన్ని నెలలుగా వ్యయ నియంత్రణ చర్యల ద్వారా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాం. అయినప్పటికీ, ద్రవ్యోల్బణ భారం అధిక స్థాయిలో ఉండటం, ప్రతికూల వ్యయ వాతావరణం కొనసాగుతుండటంతో, పెరిగిన వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయక తప్పడం లేదు. అదే సమయంలో, వినియోగదారులపై దీని ప్రభావం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూస్తాం" అని మారుతి సుజుకి తమ ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, ఈ ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని కంపెనీ స్పష్టం చేసింది. వాహనం మోడల్‌ను బట్టి పెంపు పరిమాణం మారుతుందని తెలిపింది. ఏ మోడల్‌పై ఎంత ధర పెరుగుతుందనే కచ్చితమైన వివరాలను మాత్రం కంపెనీ ఇంకా వెల్లడించలేదు.

## విద్యార్థుల ఆవేదనను గౌరవించాలి

**ప్రభుత్వానికి కేంద్రమంత్రి పాశ్వాన్ సూచన**

న్యూఢిల్లీ: ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ (ఆర్వీ) అధినేత చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ఆవేదనను గౌరవించాలని, వారి గొంతును బలప్రయోగంతో అణచివేయడాన్ని తాను సమర్థించనని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలే ఉత్తమ మార్గమని, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు ప్రతి ఒక్కరి హక్కని అన్నారు. విద్యార్థుల నిరసనలపై సానుకూలంగా స్పందించిన తొలి మంత్రి పాశ్వాన్ కావడం గమనార్హం. విద్యార్థి ప్రతినిధులు చర్చలకు ముందుకొచ్చినప్పుడు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా వారితో సమావేశమై సమస్యలపై చర్చించారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎప్పుడూ చర్చలకు సిద్ధంగానే ఉంటుందని చెప్పారు. అయితే నిరసనలు హద్దులు దాటి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అధికారులు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, అయినప్పటికీ అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నీట్ సహా పోటీ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు, సీజేపీ కార్యకర్తలు జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీ నిర్వహించగా, పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ విద్యార్థుల భావోద్వేగాలను గౌరవించాలని కేంద్రానికి సూచించారు.

# తెలంగాణకు ఐఐఎం లేదు

## స్పష్టం చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రాష్ట్రంలో ఐఐఎంను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రస్తుతానికి లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం కేంద్రం ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. ఐఐఎం మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నుంచి తమకు విజ్ఞప్తి అందిందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ వెల్లడించారు. అయితే, ప్రాంతీయ సమతుల్యత, వనరుల లభ్యత వంటి విస్తృత విధానపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే కొత్త విద్యా సంస్థలను కేంద్రం ఏర్పాటు చేస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం దేశంలోని 21 రాష్ట్రాల్లో మొత్తం 22 ఐఐఎంలు ఉన్నాయి. తెలంగాణతో పాటు గోవా, మణిపూర్, మిజోరాం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో ఐఐఎంలు లేవు. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2023-24 గణాంకాలను ఉటంకిస్తూ, తెలంగాణలో ప్రస్తుతం 2,070 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో 604 సంస్థలు మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయని, అందులో 20 విశ్వవిద్యాలయాలు, 570 కళాశాలలు, 14 స్వతంత్ర సంస్థలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. "హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) హైదరాబాద్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు ఇప్పటికే తెలంగాణలో ఉన్నాయి. వీటికి అదనంగా, 2023లో ములుగులో సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది" అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు, ప్రతిభావంతులను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం గత కొంతకాలంగా ఐఐఎం కోసం గట్టిగా పట్టుబడుతోంది. దేశవ్యాప్తంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన మేనేజ్‌మెంట్ విద్యను విస్తరించే దిశగా చర్చలు జరుగుతున్న తరుణంలో కేంద్రం ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త ఐఐఎంల ఏర్పాటుపై నిర్ణయాలు కేవలం విజ్ఞప్తుల ఆధారంగా కాకుండా, భౌగోళిక సమతుల్యత, నిధుల కేటాయింపు వంటి అంశాలపై ఆధారపడి ఉంటాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే పలు రాష్ట్రాలకు ఐఐఎంలు మంజూరు చేసినప్పటికీ, తెలంగాణ అభ్యర్థనకు మాత్రం ప్రస్తుతానికి సానుకూల స్పందన లభించలేదు.




# ఒకే కాన్పులో నలుగురు ఆడపిల్లలు

**ఇప్పటికే ఆ జంటకు ముగ్గురు పిల్లలు**

సిడ్నీ: ఆస్ట్రేలియాలో ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు ఆరోగ్యవంతమైన ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఇది చాలా అరుదైన ఘటన కాగా, ఈ పరిణామంతో వారి కుటుంబం రాత్రికి రాత్రే రెట్టింపు ఆనందంలో మునిగిపోయింది. అయితే, ఈ సంతోషంతో పాటు వారికి ఒక కొత్త ఆచరణాత్మక సమస్య ఎదురైంది. ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్న ఆ దంపతులకు, ఈ నలుగురు శిశువుల రాకతో కుటుంబ సభ్యుల సంఖ్య తొమ్మిదికి చేరింది. దీంతో కుటుంబం మొత్తం కలిసి ప్రయాణించడానికి వారి వద్ద ఉన్న కారు సరిపోవడం లేదు. బీబీసీ కథనం ప్రకారం.. మొత్తం ఏడుగురు పిల్లల సంరక్షణ బాధ్యతలు చూసుకోవాల్సి రావడంతో ప్రస్తుత కారులో అందరికీ సురక్షితంగా ప్రయాణించేందుకు సీట్లు సరిపోవడం లేదు. ఈ పెరుగుతున్న అవసరాలను తీర్చుకోవడానికి, 10 సీట్ల వ్యాన్‌ను కొనుగోలు చేసేందుకు ఆ తల్లి ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ ప్రచారాన్ని ప్రారంభించింది. కొత్త వాహనం అందుబాటులోకి వస్తే, పిల్లలను ఆసుపత్రికి తీసుకెళ్లడం, స్కూల్ కు వెళ్లి రావడం, ఇతర కుటుంబ ప్రయాణాలు చాలా సులభతరం అవుతాయని ఆమె భావిస్తున్నారు. ఒకేసారి నలుగురు ఆడపిల్లలు పుట్టడం తమ జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ఆశీర్వాదమని ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే, ఇంత పెద్ద మార్పునకు సిద్ధం కావడానికి డైపర్లు, ఫార్ములా, దుస్తులు వంటి రోజువారీ ఖర్చులతో పాటు గణనీయమైన ఆర్థిక వనరులు అవసరమని వారు అంగీకరించారు. వీటన్నింటికంటే ముఖ్యంగా కుటుంబం మొత్తం కలిసి ప్రయాణించడానికి నమ్మకమైన రవాణా సౌకర్యం తమకు అత్యంత ప్రాధాన్యత అంశంగా మారిందని వివరించారు. ఈ కష్ట సమయంలో స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారని, ఒకేసారి నలుగురు నవజాత శిశువుల ఆలనాపాలనలో వారికి సహాయం అందిస్తున్నారని బీబీసీ తన కథనంలో పేర్కొంది. ఈ అసాధారణ జననంపై విస్తృతంగా ప్రచారం జరగడంతో, చాలామంది ఆ తల్లిదండ్రులను ప్రశంసిస్తూ, వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రస్తుతం తమ ఏడుగురు పిల్లలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన వాహనం, ఇతర వనరులను సమకూర్చుకోవడంపైనే తాము పూర్తి దృష్టి సారించినట్లు ఆ కుటుంబం తెలిపింది.

# దాడి చేస్తారని భయపడ్డా: కంగనా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకున్న నిరసనల నేపథ్యంలో తాను ఎదుర్కొన్న భయానక పరిస్థితులను బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ వివరించారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలు పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో, తాను ఉన్న భవనానికి అధికారులు తాళం వేశారని ఆమె తెలిపారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె, నిరసనకారుల తీరు చూసి పలువురు ఎంపీలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని పేర్కొన్నారు. నిరసనకారులు పార్లమెంటు ముట్టడికి ర్యాలీగా తరలివచ్చిన సమయంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని ఆమె పేర్కొన్నారు. "మీరు కూడా లోపలే ఉన్నారు కదా.. ఆ సమయంలో అందరూ ఎంతగా భయపడ్డారో గమనించే ఉంటారు. భద్రతా కారణాల దృష్ట్యా గేట్లు మూసివేయడంతో ఎంపీలందరూ లోపలే ఉండిపోవాల్సి వచ్చింది. సభ వాయిదా పడినప్పటికీ మేము బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిరసనకారులు మాపై దాడి చేస్తారేమోనన్న భయం ఒక దశలో కలిగింది" అని కంగనా చెప్పుకొచ్చారు. ఆందోళనకారులను అదుపు చేసి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరోధించిన ఢిల్లీ పోలీసులను ఆమె ప్రశంసించారు. "ఢిల్లీ పోలీసుల పనితీరు అభినందనీయం. వారు మాకు కవచంలా నిలిచి, నిరసనకారుల దాడులను ఎదుర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి హాని కలగకుండా రక్షణ కల్పించారు. వారికి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని ఆమె అన్నారు. నీట్ పరీక్ష అక్రమాలపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఆందోళనలు ఉద్ధృతమయ్యాయి. నిరసనకారులు పార్లమెంట్ వైపు మార్చ్‌కు ప్రయత్నించడంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సరిగ్గా అదే సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.



## భర్తల ఉద్యోగాలు పోగొడితే భరణంపై ఎఫెక్ట్

**సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన**

న్యూఢిల్లీ: వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. "ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం" అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## బ్రిటన్‌లో ఏఐ మంత్రిగా కనిష్క నారాయణ్

లండన్: బ్రిటన్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశపు మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) మంత్రిగా భారత మూలాలున్న కనిష్క నారాయణ్‌ను నియమిస్తున్నట్లు నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ ప్రకటించారు. శరవేగంగా విస్తరిస్తున్న ఏఐ సాంకేతికతలో ప్రపంచస్థాయి అగ్రగామిగా నిలవాలన్న యూకే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకం అద్దం పడుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఏఐతో ముడిపడిన అవకాశాలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఏఐ నియంత్రణ, నైతిక వినియోగం, ఆర్థిక వ్యవస్థతో దాని అనుసంధానం వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల రంగంలో అపార అనుభవం ఉన్న కనిష్క నారాయణ్ నియామకాన్ని ఒక వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకుంటూనే, దానితో ముడిపడిన ముప్పులను నివారించడం ఆయన ప్రధాన బాధ్యత కానుంది. కనిష్క వేల్స్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రధాని ఆండీ బర్న్‌హామ్ భారత మూలాలున్న ఇద్దరికి తన కేబినెట్లో చోటు కల్పించారు. వారిలో కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీ ఉన్నారు. కనిష్క గతంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆన్ లైన్ మేధ విభాగాలను పర్యవేక్షించిన ఆయన, ఇప్పుడు పూర్తిస్థాయిలో ఏఐ మంత్రిగా నియమితుల య్యారు. బీహార్‌లో జన్మించిన కనిష్క నారాయణ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన ఆయన, 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

## పోలీస్ స్టేషన్‌కు సోనియా

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలతో దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. ఆందోళన చేస్తూ పోలీసుల నిర్బంధంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలను కలిసేందుకు ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. అయితే, భద్రతా కారణాల రీత్యా ఆమెను లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో పోలీస్ స్టేషన్ వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రియాంక, తదితర నేతలను మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్ ను ఛత్రసాల్ స్టేడియం పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాసేపటి తర్వాత రాహుల్ గాంధీని ఛత్రసాల్ పీఎస్ ను విడుదల చేశారు. అటు, ప్రియాంక, దీపేందర్ హుడా తదితర నేతలను మందిర్ మార్గ్ పీఎస్ నుంచి విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం తర్వాత, నీట్ పరీక్షలో అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గే సహా పలువురు కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జిని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

## కోకాకోలాకు కొత్త లుక్

**మారనున్న బ్రాండ్ ఐడెంటిటీ**

న్యూఢిల్లీ: శీతల పానీయాల దిగ్గజం కోకా-కోలా తన బ్రాండ్‌కు సరికొత్త రూపును అందిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో తన ఉనికిని చాటుకునేలా నూతన 'గ్లోబల్ బ్రాండ్ ఐడెంటిటీ'ని మంగళవారం అధికారికంగా ఆవిష్కరించింది. మారుతున్న వినియోగదారుల అభిరుచులు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్పు ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కోకా-కోలా ప్యాకేజింగ్, మార్కెటింగ్ ప్రచారాలు, డిజిటల్ వేదికలపై స్పష్టంగా కనిపించనుంది. బ్రాండ్ వారసత్వ విలువలను కాపాడుకుంటూనే, వినియోగదారులతో మరింత బలమైన భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచుకోవడమే తమ లక్ష్యమని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నూతన గుర్తింపులో భాగంగా లోగోలో స్వల్ప మార్పులు, ఆకర్షణీయమైన రంగులు, ఆధునిక టైపోగ్రఫీ వంటి అంశాలను జోడించారు. శీతల పానీయాల రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని, మార్కెట్లో తమ అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకునే వ్యూహంలో భాగంగానే ఈ మార్పులు చేపట్టినట్లు కోకా-కోలా వివరించింది. ఈ సరికొత్త బ్రాండ్ ఐడెంటిటీని త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఆయా ప్రాంతాలలో ఈ మార్పులు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయనే వివరాలను కంపెనీ త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది.

## రాహుల్ మాట మార్చారు

**కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్ష వివాదంపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పినా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి నిమిషంలో మాట మార్చారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీంతోప్రతిష్టంభన ఏర్పడిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు రాహుల్ కట్టుబడలేదని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి కొత్త షరతులు పెట్టడంతో చర్చలు ముందుకు సాగలేదని ఆయన విమర్శించారు. నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని ప్రధాని నివాసం సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ధర్నా ప్రారంభమైన గంట తర్వాత మంత్రి జితేంద్ర సింగ్ అక్కడికి చేరుకుని రాహుల్‌తో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. నీట్ అంశంపై కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందని, కానీ ఆ తర్వాత రాహుల్ గాంధీ మరో కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడంతో చర్చలు విఫలమయ్యాయని జితేంద్ర సింగ్ వివరించారు. మరోవైపు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నీట్ వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

## బర్గర్ బ్యాచ్.. సీజేపీ వేటు!

న్యూఢిల్లీ: యువజన ఉద్యమ పార్టీగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), తమ అధికార ప్రతినిధి విజేత దహియాపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఆయన ప్రవర్తన తీవ్ర వివాదాస్పదం కావడంతో, పార్టీ ఆయనపై వేటు వేస్తూ మంగళవారం నిర్ణయం తీసుకుంది. దహియాను తక్షణమే అన్ని అధికారిక బాధ్యతల నుండి తొలగిస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. 'నీట్' పరీక్షల్లో నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై జవాబుదారీతనం వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సోనమ్ వాంగ్‌చుక్ వంటి ప్రముఖులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, అదే నిరసన స్థలికి సమీపంలో దహియా బర్గర్ తింటూ కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై వివరణ కోరగా, తాను ఎన్నికైన ప్రతినిధిని కానని, కేవలం స్వచ్ఛందంగానే ఉద్యమంలో పాల్గొంటున్నానని, తానెవరికీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆయన సమాధానమివ్వడం మరింత వివాదానికి దారితీసింది.

## ఒయ్యారి చిత్రం



వాణీ కపూర్

# అనుపమ-ధృవ్ బ్రేకప్?



మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఈ సారి ఆమె సినిమాల కంటే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలే ఎక్కువగా చర్చనీయాంశమవుతున్నాయి. తమిళ నటుడు ధ్రువ్ విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నారని, ఇప్పుడు ఇద్దరూ విడిపోయారనే ప్రచారం కోలీవుడ్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అనుపమ, ధ్రువ్ విక్రమ్ కలిసి నటించిన 'బైసన్' సినిమా తర్వాత వీరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందని, కొంతకాలంగా ప్రేమలో ఉన్నారనే వార్తలు అప్పట్లో వినిపించాయి. అయితే దీనిపై ఇద్దరూ ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. తాజాగా సోషల్ మీడియాలో మరోసారి వీరి గురించి బ్రేకప్ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అనుపమ తన ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన కొన్ని పోస్టులు, అలాగే ధ్రువ్ విక్రమ్‌ను అన్‌ఫాలో చేసినట్లు కనిపించడంతో ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే ఊహాగానాల మధ్య ఇలాంటి వార్తలు రావడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతేకాదు, చెన్నైలోని ఓ హోటల్‌లో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని, ఆ తర్వాత అనుపమ ధ్రువ్‌తో సంబంధాలను పూర్తిగా ముగించిందంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి క్లారిటీ లేదు.



## షూటింగ్‌లో బాలయ్యకు గాయం

నందమూరి బాలకృష్ణ ఈ వయస్సులోను కుర్ర హీరోలతో పోటీ పడి సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం.





## ఈటీవీ చేతికి ఓజీ టెలివిజన్ రైట్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ దే కాల్ హిమ్ ఓజీ విడుదలై దాదాపు పది నెలలు గడిచినా.. ఆ సినిమా క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుని పవన్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా మరోసారి వార్తల్లో నిలవడానికి కారణం.. టెలివిజన్ ప్రీమియర్‌తో పాటు సీక్వెల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్. ఇప్పటివరకు ఈ చిత్రం శాటిలైట్ హక్కులపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే తాజాగా ప్రముఖ తెలుగు ఛానెల్ ఈటీవీ ఈ సినిమా టెలివిజన్ హక్కులను సొంతం చేసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే ఛానెల్‌లో ప్రత్యేక ప్రోమోలు ప్రసారం అవుతుండగా.. ఆగస్టులో వచ్చే ఓ ప్రముఖ పండుగ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ప్రసారం చేయనున్నట్లు సమాచారం. దీంతో బుల్లితెరపై 'ఓజీ'ని చూడాలని ఎదురుచూస్తున్న అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఇక అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగించే వార్త ఏమిటంటే.. 'ఓజీ 2' తెరకెక్కించే దిశగా అధికారిక చర్చలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌ను రూపొందించాలనే ఆసక్తిని స్వయంగా పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం ముగిసిన తీరు కూడా రెండో భాగానికి మంచి అవకాశాన్ని కల్పించడంతో, కథ అభివృద్ధిపై ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని సమాచారం.

## అమితాబ్‌కు శస్త్రచికిత్స

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆరోగ్యానికి సంబంధించిన వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 83 ఏళ్ల వయసులో ఆయనకు ఇటీవల శస్త్రచికిత్స జరిగినట్లు సమాచారం. ఈ విషయాన్ని అమితాబ్ బచ్చన్ నేరుగా వెల్లడించకపోయినా, తన వ్యక్తిగత బ్లాగ్‌లో చేసిన కామెంట్ ద్వారా అభిమానులకు పరోక్షంగా తెలియజేశారు. రోజువారీ జీవితంలో జరిగిన అనుభవాలు, ఆలోచనలు, సంఘటనలను తన బ్లాగ్ ద్వారా అభిమానులతో పంచుకునే అమితాబ్ బచ్చన్.. ఈసారి కూడా ఆస్పత్రి అనుభవాన్ని వివరించారు. శస్త్రచికిత్స, ఐసీయూలో నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన సేవలు, అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయాలను ప్రస్తావించారు. దీంతో ఆయనకు ఇటీవల ఆపరేషన్ జరిగినట్లు అభిమానులు గుర్తించారు.





## 'గాడ్ ఆఫ్ వార్'లో ఎన్టీఆర్‌తో కియారా జోడీ?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. దీంతో 'గాడ్ ఆఫ్ వార్'లో నిజంగానే కియారా హీరోయిన్‌గా ఎంపికైతే.. తొలిసారి ఎన్టీఆర్ సరసన పూర్తి స్థాయి కథానాయికగా కనిపించే అవకాశం ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు.





## చరణ్‌కు జోడీగా రష్మిక!

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

## అర్జున్ ఇరిగేసి నం.1

చెన్నై వేదికగా జరుగుతున్న క్వాంట్‌బాక్స్ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్-2026లో తెలంగాణకు చెందిన భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి సంచలన విజయం సాధించాడు. సోమవారం జరిగిన ఐదో రౌండ్ పోరులో ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై నల్లపావులతో ఆడి గెలుపొందాడు. ఈ విజయంతో అర్జున్ టోర్నీ పాయింట్ల పట్టికలో సంయుక్త అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. మొత్తం ఏడు రౌండ్ల ఈ టోర్నీలో ఐదు రౌండ్లు ముగిసేసరికి అర్జున్ ఇరిగేసి, ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజా ఫిరోజా చెరో 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. మరోవైపు, ఈ టోర్నీలో రెండో ఓటమిని చవిచూసిన గుకేశ్, 1.5 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయాడు. ఉజ్బెకిస్థాన్ ప్లేయర్ నోదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ 3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు.



## ఫిఫా గొడవ.. వాళ్లంతా జైలుకే!

ఫిఫా వరల్డ్ కప్ 2026 సోమవారం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఫైనల్ మ్యాచ్ లో స్పెయిన్, అర్జెంటీనా తలపడ్డాయి. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్ లో 1-0 తేడాతో గెలిచి... టైటిల్ కైవసం చేసుకుంది స్పెయిన్. అయితే మ్యాచ్ ముగిసిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు కాస్త ఓవర్ గా బిహేవ్ చేశారు. ఓటమిని తట్టుకోలేక స్పెయిన్ కుర్రాళ్లతో గొడవ పెట్టుకున్నారు. దీంతో ఇరు ప్లేయర్ల మధ్య పెద్ద గొడవే జరిగింది. అయితే ఈ సంఘటనపై తాజాగా ఫిఫా కీలక ప్రకటన చేసింది. ప్లేయర్లు కొట్టుకున్న సంఘటనపై విచారణ ప్రారంభించినట్లు వెల్లడించింది. క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే మ్యాచ్ రిపోర్టులను పరిశీలించినట్లు స్పష్టం చేసింది. దర్యాప్తునకు డిసిప్లినరీ అలాగే ఎథిక్స్ ప్రాసిక్యూటర్ ను నియమించినట్లు కీలక ప్రకటన చేసింది. దీనిపై విచారణ పూర్తయిన తర్వాత వివరాలను బహిర్గతం చేస్తామని తెలిపింది ఫిఫా. ఈ సంఘటనలో తప్పు ఎవరు చేసినా, కఠిన శిక్ష తప్పదని హెచ్చరించింది.



## కోహ్లీ మాటలు స్ఫూర్తినింపాయి: పీవీ సింధు

భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు తన సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న మేజర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. జపాన్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించింది. ఫైనల్‌లో తన చిరకాల ప్రత్యర్థి, వరల్డ్ నంబర్ 3 క్రీడాకారిణి అకానే యమగూచిని చిత్తు చేసి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన సింధు 21-17, 21-17 తేడాతో వరుస సెట్లలో గెలుపొందింది. ఈ టైటిల్ గెలిచిన తొలి భారత మహిళగా సింధు చరిత్ర సృష్టించింది. 2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ గెలిచిన తర్వాత సింధుకు ఇదే తొలి మేజర్ బీడబ్ల్యూఎఫ్ టైటిల్ కావడం విశేషం. గత కొంతకాలంగా గాయాలు, ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న సింధు, ఈ విజయంతో ఘనంగా పునరాగమనం చేసింది. తనలో ఆత్మవిశ్వాసం నింపిన ఒక ఆసక్తికర విషయాన్ని సింధు పంచుకుంది. భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీతో జరిపిన సంభాషణ తనలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని తెలిపింది. "మా మధ్య ఏం జరిగిందనేది మా మధ్యే ఉంటుంది. కానీ అవసరమైన సమయంలో ఆయన నాకు అండగా నిలిచారు. ఆయన ఎక్కువగా మాట్లాడలేదు, కానీ చెప్పిన ప్రతి మాట నా మదిలో నిలిచిపోయింది. కొన్ని సంభాషణలు మన ఆలోచనా విధానాన్ని మారుస్తాయి. ఇది అలాంటిదే" అని సింధు వివరించింది.





# ఆగస్టు 15 నుంచి హాకీ వరల్డ్‌కప్



**ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ వరల్డ్ కప్ సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం 20 మందితో కూడిన స్క్వాడ్‌ను హాకీ ఇండియా ప్రకటించింది. అంతర్జాతీయ అనుభవమున్న సీనియర్లు, ప్రతిభావంతులైన జూనియర్లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది.**

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం అందించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత హాకీ జట్టు వరల్డ్‌కప్ బరిలో దిగనుంది. హాకీ వరల్డ్‌కప్ కోసం సమతూకంతో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేసింది హాకీ ఇండియా. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా 20 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ప్రకటించింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మన్‌ప్రీత్ సింగ్ ఈ మెగాటోర్నీకి ఎంపికయ్యాడు. గోల్ కీపర్లుగా మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కేరా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. యువకులు రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. 'ఇది పూర్తిగా సమతూకంతో కూడిన స్క్వాడ్. అంతర్జాతీయ అనుభవమున్న ఆటగాళ్లు, ప్రతిభను చాటుకున్న జూనియర్లను తీసుకున్నాం. ఒక్కో మ్యాచ్ గెలవడంపైనే దృష్టి సారిస్తున్నాం. ఇదే దృక్పథంలో వరల్డ్‌కప్ బరిలో దిగుతున్నాం' అని ప్రధాన కోచ్ క్రెయిగ్ ఫల్టన్ పేర్కొన్నాడు. నెదర్లాండ్స్‌లో ఆగస్టు 15 నుంచి 30వ తేదీ వరకూ పురుషుల హాకీ వరల్డ్‌కప్ జరుగనుంది. గ్రూప్ డీలో ఉన్న భారత్ లీడ్ దశలో ఇంగ్లండ్, వేల్స్, పాకిస్థాన్‌తో తలపడనుంది. టోర్నీ ఆరంభం రోజే వేల్స్‌ను టీమిండియా ఢీకొట్టనుంది. ఆగస్టు 17న ఇంగ్లండ్‌తో, చిరకాల ప్రత్యర్థి పాక్‌తో ఆగస్టు 19న హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

### హాకీ వరల్డ్‌కప్ స్క్వాడ్

*గోల్ కీపర్స్ - మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కేరా.*
*డిఫెండర్లు - జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్(కెప్టెన్), అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, యశ్‌దీప్ సివాచ్.*
*మిడ్‌ఫీల్డర్స్ - రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ లలాప్, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ ప్రసాద్.*
*ఫార్వర్డ్స్ - దిల్‌ప్రీత్ సింగ్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్.*



## రోహిత్ ధైర్యమిచ్చినా నమ్మలేదు: సంజూ

టీ20 ప్రపంచకప్-2026లో తొలుత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన తర్వాత ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించడంతో తన ప్రపంచకప్ అవకాశాలు ముగిసిపోయాయని భావించినట్లు చెప్పాడు. ఆ సమయంలో రోహిత్ శర్మ ధైర్యం చెప్పినా తాను ఆ మాటలను నమ్మలేకపోయానని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. ప్రపంచకప్ ప్రారంభమైన తొలి నాలుగు, ఐదు రోజులు ఆ నిరాశ నుంచి బయటపడలేకపోయానని సంజూ చెప్పాడు. ఆ తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని.. అసలు తాను క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నానని వివరించాడు. అదే తనలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, మానసికంగా బలంగా మారేందుకు దోహదపడిందని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు మరింత మెరుగ్గా సిద్ధమయ్యానని సంజూ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ప్రతి షాట్ సహజంగానే వచ్చిందని, అది తన కెరీర్‌లో ప్రత్యేకమైన ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని అన్నాడు. వికెట్లు పడుతుండటంతో సాధారణ ఆటతీరును మార్చుకుని పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేశానని వివరించాడు. ఇక న్యూజిలాండ్ సిరీస్ తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని సంజూ చెప్పాడు. ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే ముఖ్యమని తన భార్య చెప్పిన మాటలు అప్పుడే అర్థమయ్యాయని పేర్కొన్నాడు. తాను సాధించిన విజయాల్లో దేవుడి ఆశీర్వాదమే ఎక్కువని, ఆ ప్రపంచకప్ ఇన్నింగ్స్ జీవితాంతం గుర్తుండిపోతుందని సంజూ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.

## ఓటమి గాయం తేలిగ్గా మానదు



ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో ఓటమి బాధ ఇంకా వెంటాడుతోందని అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీ భావోద్వేగంగా స్పందించాడు. స్పెయిన్ చేతిలో తుది పోరులో ఓడిపోవడం తీవ్ర వేదన కలిగించిందని, ఆ గాయం మానేందుకు సమయం పడుతుందని పేర్కొన్నాడు. అయితే టోర్నీలో జట్టు చేసిన పోరాటం, అభిమానుల మద్దతు జీవితాంతం గుర్తుండిపోతాయని చెప్పాడు. న్యూజెర్సీలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ అదనపు సమయంలో చేసిన ఏకైక గోల్‌తో అర్జెంటీనాపై 1-0తో విజయం సాధించింది. ఫెర్రాన్ టొరెస్ చేసిన గోల్‌తో స్పెయిన్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్ సాధించాలన్న అర్జెంటీనా ఆశలు ఈ ఓటమితో అడియాశలయ్యాయి. అలాగే కెరీర్‌కు మరో ప్రపంచకప్‌ను జోడించాలన్న మెస్సీ కల కూడా నెరవేరలేదు. ఫైనల్ అనంతరం తొలిసారి సోషల్ మీడియాలో స్పందించిన 39 ఏళ్ల మెస్సీ.. "ఈ బాధ చాలా పెద్దది. ఈ గాయం మానేందుకు సమయం పడుతుంది. అయినా ఈ టోర్నీలో మాకు దక్కిన మంచి జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేం. చివరి వరకు పోరాడిన మ్యాచ్‌లు, దేశం మొత్తం ఇచ్చిన అండ, జట్టు శ్రమ మమ్మల్ని మరోసారి ప్రపంచ అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలబెట్టాయి" అని పేర్కొన్నాడు.



## రోహిత్, కోహ్లీని తీయడం అసాధ్యం: అశ్విన్

భారత జట్టులోని సీనియర్ స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను జట్టు నుంచి తొలగించడం దాదాపు అసాధ్యమని టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. వారి అద్భుతమైన ట్రాక్ రికార్డులు, అపారమైన అభిమాన గణమే ఇందుకు ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించాడు. తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై జరుగుతున్న చర్చపై ఆయన స్పందిస్తూ.. వన్డే ఫార్మాట్‌లో కొనసాగాలని రోహిత్, కోహ్లీ భావిస్తే, వారిని జట్టు నుంచి తప్పించడం అటు మేనేజ్‌మెంట్‌కు గానీ, ఇటు సెలెక్టర్లకు గానీ అంత సులభం కాదని పేర్కొన్నారు. లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో రోహిత్ అజేయ సెంచరీతో (138) విమర్శలకు దీటైన సమాధానమిచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశాడు. "ముందుగా వారికున్న అద్భుతమైన ట్రాక్ రికార్డును గమనించాలి. రోహిత్ వన్డేల్లో దాదాపు 12,000 పరుగులు సాధించారు. రెండోది, వారిద్దరూ అగ్రశ్రేణి స్టార్ బ్యాటర్లు. వారి ఆటను వీక్షించేందుకే లక్షలాది మంది అభిమానులు స్టేడియాలకు తరలివస్తారు. అటువంటి ఆటగాళ్లను జట్టు నుంచి తొలగిస్తే తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వస్తుంది," అని అశ్విన్ వివరించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 22-7-2026, జగిత్యాల



నేటి ఈవార్తలు


సంపాదకీయం Editorial

# పిల్లల బాల్యాన్ని కోల్పోతున్నాం?

ఒకప్పుడు పిల్లల బాల్యం అంటే మైదానాల్లో ఆటలు, స్నేహితులతో సందడి, పుస్తకాలతో పరిచయం, కుటుంబంతో గడిపే సమయం గుర్తుకొచ్చేది. నేడు ఆ దృశ్యం వేగంగా మారుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఎదుట టాబ్లెట్, చెవిలో ఇయర్‌ఫోన్స్---ఇదే నేటి పిల్లల ప్రపంచంగా మారుతోంది. సాంకేతికత విద్యకు, విజ్ఞానానికి ఎన్నో అవకాశాలు కల్పించినప్పటికీ, అదే సాంకేతికత అదుపు తప్పిన వినియోగంతో పిల్లల బాల్యాన్ని నెమ్మదిగా దూరం చేస్తోందనే ఆందోళన పెరుగుతోంది. కరోనా మహమ్మారి సమయంలో ఆన్‌లైన్ తరగతులు అనివార్యమయ్యాయి. ఆ అవసరం పిల్లలకు డిజిటల్ ప్రపంచాన్ని దగ్గర చేసింది. అయితే తరగతులు ముగిసిన తర్వాత కూడా మొబైల్, వీడియో గేమ్స్, సోషల్ మీడియా, షార్ట్ వీడియోలు, ఓటీటీ కంటెంట్ పిల్లల దైనందిన జీవితంలో భాగమైపోయాయి. అవసరం క్రమంగా అలవాటుగా, అలవాటు చివరకు వ్యసనంగా మారుతోంది. డిజిటల్ వ్యసనం ప్రభావం కేవలం కళ్ల ఆరోగ్యంపైనే కాదు; పిల్లల మానసిక, శారీరక, సామాజిక వికాసంపైనా తీవ్రంగా పడుతోంది. గంటల తరబడి స్క్రీన్ ఎదుట గడపడం వల్ల ఊబకాయం, నిద్రలేమి, ఏకాగ్రత లోపం, చిరాకు, ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. నిరంతరం మారే వీడియోలు, గేమ్స్ వల్ల పిల్లల మెదడు తక్షణ వినోదానికి అలవాటు పడుతోంది. ఫలితంగా చదువుపై ఆసక్తి తగ్గడం, ఓపిక కోల్పోవడం, సృజనాత్మకత దెబ్బతినడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. మరోవైపు డిజిటల్ ప్రపంచంలో పిల్లలకు ఎదురయ్యే ప్రమాదాలు కూడా చిన్నవి కావు. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ మోసాలు, అనుచిత కంటెంట్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వాస్తవ జీవితంలో స్నేహితులతో గడిపే సమయం తగ్గి, వర్చువల్ ప్రపంచంలోనే ఎక్కువ సమయం గడపడం వల్ల సామాజిక నైపుణ్యాలు కూడా బలహీనపడుతున్నాయి. ఈ పరిస్థితికి పిల్లలను మాత్రమే బాధ్యులుగా చూడడం సరైంది కాదు. తల్లిదండ్రుల జీవనశైలి కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. ఏడుస్తున్న చిన్నారిని శాంతింపజేయడానికి మొబైల్ ఇవ్వడం, తాము కూడా ఎప్పుడూ ఫోన్‌లోనే ఉండడం, కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలు తగ్గిపోవడం వంటి పరిస్థితులు పిల్లలకు అదే అలవాటును నేర్పిస్తున్నాయి. పిల్లలు వినేది కంటే చూసేదే ఎక్కువగా అనుకరిస్తారు. విద్యాసంస్థలూ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలి. డిజిటల్ లిటరసీతో పాటు డిజిటల్ డిసిప్లిన్‌ను కూడా బోధించాలి. స్క్రీన్ టైమ్‌పై అవగాహన కల్పించడం, క్రీడలు, కళలు, పఠనం, సృజనాత్మక కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. విద్య అంటే కేవలం సాంకేతిక పరిజ్ఞానం కాదు; వ్యక్తిత్వ వికాసం కూడా. ప్రభుత్వాలు కూడా పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం కఠిన విధానాలు అమలు చేయాలి. పిల్లలను లక్ష్యంగా చేసుకున్న హానికర డిజిటల్ కంటెంట్‌పై నియంత్రణ, వయస్సు నిర్ధారణ వ్యవస్థలు, డేటా గోప్యత, సైబర్ భద్రతపై మరింత దృష్టి పెట్టాలి. సాంకేతిక సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తించి, పిల్లల కోసం ఆరోగ్యకరమైన డిజిటల్ వాతావరణాన్ని రూపొందించాలి. అయితే పరిష్కారం పూర్తిగా సాంకేతికతను దూరం చేయడంలో లేదు. ఈ రోజుల్లో డిజిటల్ నైపుణ్యాలు అవసరమే. కానీ సాంకేతికత మనిషికి సేవ చేయాలి; మనిషి సాంకేతికతకు బానిస కాకూడదు. పిల్లలకు స్క్రీన్‌తో పాటు మైదానం, మొబైల్‌తో పాటు పుస్తకం, వీడియోలతో పాటు నిజమైన అనుభవాలు, వర్చువల్ ప్రపంచంతో పాటు కుటుంబ అనుబంధం కూడా అందించాలి. బాల్యం జీవితంలో ఒక్కసారే వస్తుంది. ఆ అమూల్యమైన దశను స్క్రీన్ వెలుగులో కాకుండా అనుభవాల వెలుగులో వికసించేలా చేయడం కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. పిల్లలకు అత్యాధునిక గాడ్జెట్లు ఇవ్వడం కంటే, వారితో కొంత సమయం గడపడం గొప్ప బహుమతి. బాల్యాన్ని కాపాడటం అంటే భావితరాల భవిష్యత్తును కాపాడటమే.

# సముద్ర తీరం.. డిజిటల్ కేంద్రం

**భారతదేశంలో ఐటీ రంగం అంటే ఇప్పటికీ బెంగళూరు, హైదరాబాద్, పుణే, చెన్నై, గురుగ్రామ్ వంటి నగరాలే గుర్తుకు వస్తాయి. అయితే గత కొన్నేళ్లుగా విశాఖపట్నం కూడా ఈ జాబితాలో చేరేందుకు ప్రయత్నిస్తోంది. ప్రకృతి సంపద, సముద్రతీరం, అంతర్జాతీయ పోర్టు, పారిశ్రామిక వారసత్వం, విద్యాసంస్థలు, మెరుగైన జీవన ప్రమాణాలు వంటి అనేక ప్రత్యేకతలు విశాఖను ఐటీ రంగానికి అనుకూల నగరంగా నిలబెడుతున్నాయి. కానీ ఒక ప్రశ్న మాత్రం ఇంకా మిగిలే ఉంది.. విశాఖ నిజంగా హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా, దేశంలో ప్రముఖ ఐటీ హబ్‌గా ఎదగగలదా?**




విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద నగరం. ఒకవైపు సహజ నౌకాశ్రయం, మరోవైపు స్టీల్ ప్లాంట్, రిఫైనరీ, షిప్‌యార్డ్, ఫార్మా, పెట్రోకెమికల్ పరిశ్రమలు ఉండటంతో ఇది ఎప్పటి నుంచో పారిశ్రామిక కేంద్రంగా పేరుగాంచింది. ఇప్పుడు అదే నగరాన్ని నాలుగో పారిశ్రామిక విప్లవానికి అనుగుణంగా ఐటీ, డిజిటల్ సేవలు, డేటా సెంటర్లు, స్టార్టప్‌లు, ఫిన్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యం ప్రభుత్వం ముందుంచింది. విశాఖకు ఉన్న అతిపెద్ద బలం దాని భౌగోళిక స్థానం. తూర్పు తీరంలో ప్రధాన నౌకాశ్రయం కావడం వల్ల అంతర్జాతీయ వాణిజ్యానికి ఇది కీలక కేంద్రం. రహదారి, రైల్వే, విమాన సౌకర్యాలు కూడా మెరుగ్గా ఉన్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తయితే విదేశీ పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. అలాగే చెన్నై–కొల్కతా పారిశ్రామిక కారిడార్, విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ వంటి ప్రాజెక్టులు నగర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వగలవు. ఐటీ పరిశ్రమకు అత్యంత అవసరమైన అంశం మానవ వనరులు. ఈ విషయంలో విశాఖకు మంచి అవకాశాలున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం, ఐఐఎం, ఐఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతి ఏడాది వేలాది మంది సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్నాయి. అయితే వీరిలో చాలామంది ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా విదేశాలకు వెళ్తున్నారు. స్థానికంగా తగిన అవకాశాలు కల్పిస్తే ఈ ప్రతిభను విశాఖలోనే నిలబెట్టుకోవచ్చు. విశాఖలో ఇప్పటికే కొన్ని జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఐటీ ప్రత్యేక ఆర్థిక మండలాలు, టెక్ పార్కులు, ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పడుతున్నాయి. స్టార్టప్‌లకు ప్రోత్సాహం కూడా పెరుగుతోంది. అయినప్పటికీ హైదరాబాద్ లేదా బెంగళూరుతో పోలిస్తే కంపెనీల సంఖ్య, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడుల పరంగా ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలంటే కేవలం భవనాలు నిర్మించడం సరిపోదు. పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన విద్యుత్, హైస్పీడ్ ఇంటర్నెట్, ప్రపంచ స్థాయి కార్యాలయ వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల నివాస ప్రాంతాలు అవసరం. విదేశీ కంపెనీలు ఒక నగరాన్ని ఎంచుకునే ముందు వ్యాపార సౌలభ్యం, చట్టవ్యవస్థ, ప్రతిభ లభ్యత, జీవన నాణ్యత, రవాణా సౌకర్యాలను సమగ్రంగా పరిశీలిస్తాయి. విశాఖకు మరో ప్రధాన బలం జీవన నాణ్యత. ట్రాఫిక్ సమస్యలు హైదరాబాద్, బెంగళూరుతో పోలిస్తే తక్కువ. సముద్రతీరం, పచ్చని కొండలు, స్వచ్ఛమైన వాతావరణం, తక్కువ కాలుష్యం ఉద్యోగులకు ఆకర్షణీయంగా ఉంటాయి. "వర్క్–లైఫ్ బ్యాలెన్స్" కోరుకునే యువతకు విశాఖ మంచి ఎంపిక కావచ్చు. ఇదే అంశాన్ని పెట్టుబడులను ఆకర్షించే సాధనంగా మార్చుకోవాలి. అయితే కొన్ని సవాళ్లను విస్మరించలేం. పెద్ద స్థాయి ఐటీ సంస్థల కొరత, పరిమిత విమాన కనెక్టివిటీ, రాత్రి ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడం, అంతర్జాతీయ పాఠశాలలు, ప్రత్యేక నైపుణ్యాలున్న ఉద్యోగుల కొరత, స్టార్టప్‌లకు తగినంత వెంచర్ క్యాపిటల్ అందుబాటులో లేకపోవడం వంటి అంశాలు అభివృద్ధికి అడ్డంకులుగా ఉన్నాయి. అంతేకాదు, ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాల్లో అనిశ్చితి ఏర్పడితే పెట్టుబడిదారుల్లో సందేహాలు పెరిగే ప్రమాదం ఉంది. ఐటీ రంగానికి ముఖ్యంగా అవసరమయ్యేది విధానాల స్థిరత్వం.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ కొత్త రంగాలపై దృష్టి సారిస్తే విశాఖకు సంప్రదాయ ఐటీ సేవలకంటే ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్లు, సముద్ర కేబుల్ కనెక్టివిటీ, ఫిన్‌టెక్, మెరైన్ టెక్నాలజీ, బ్లూ ఎకానమీ, డిఫెన్స్ టెక్నాలజీ వంటి రంగాల్లో విశాఖకు ప్రత్యేకమైన ఆధిక్యం ఉంది. అలాగే "ఒకే నగరంపై ఆధారపడే అభివృద్ధి" కంటే "బహుళ ఐటీ నగరాల అభివృద్ధి" అనే విధానం దేశానికి కూడా అవసరం. హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడానికి విశాఖ, తిరుపతి, విజయవాడ వంటి నగరాల్లో ఐటీ రంగాన్ని విస్తరించడం సమతుల అభివృద్ధికి దోహదపడుతుంది. అభివృద్ధి అంటే కేవలం భారీ పెట్టుబడులు కాదు; స్థానిక యువతకు నాణ్యమైన ఉద్యోగాలు, స్టార్టప్‌లకు అవకాశాలు, ప్రపంచ స్థాయి నైపుణ్యాల పెంపుదల కూడా. విశాఖలో చదువుకున్న యువకుడు ఉద్యోగం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయగలిగితేనే ఈ నగరం నిజమైన ఐటీ హబ్‌గా నిలుస్తుంది. విశాఖపట్నానికి అవకాశాలు అపారంగా ఉన్నాయి. కానీ అవకాశాలు మాత్రమే నగరాలను ఐటీ హబ్‌లుగా మార్చవు; స్థిరమైన విధానాలు, దీర్ఘకాలిక ప్రణాళిక, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడిదారుల విశ్వాసం కలిసి వచ్చినప్పుడే ఆ లక్ష్యం సాకారమవుతుంది. సముద్ర అలలు ప్రతిరోజూ తీరాన్ని తాకినట్లే, నిరంతర కృషి, స్పష్టమైన దిశతో ముందుకెళ్తే విశాఖపట్నం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారత ఐటీ పటంలోనూ ఒక ప్రముఖ కేంద్రంగా నిలిచే సామర్థ్యం కలిగిన నగరమే.

**- ముప్పావుల సతీశ్ రాజు, విశాఖపట్నం**

# పెద్దోళ్లే కుటుంబాల బలం





**"మాతృదేవో భవ, పితృదేవో భవ" అని తల్లిదండ్రులను దైవంతో సమానంగా గౌరవించే సంస్కృతి భారతదేశానికి వేల ఏళ్ల వారసత్వం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ సమాజానికి వెన్నెముకగా నిలిచేది. తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, పెద్దలు ఇంటికి పెద్దదిక్కుగా ఉండేవారు. కుటుంబ నిర్ణయాల్లో వారి మాటకు విలువ ఉండేది. పిల్లల పెంపకం నుంచి కుటుంబ విలువల బోధన వరకు వారి పాత్ర ఎంతో కీలకం. కానీ నేడు వేగంగా మారుతున్న జీవనశైలి, పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, గ్లోబలైజేషన్ ప్రభావంతో కుటుంబ వ్యవస్థలో విపరీతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పుల ప్రభావం అత్యధికంగా పడుతున్న వర్గం వృద్ధులే.**

భారతదేశంలో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. వైద్య రంగం అభివృద్ధి, ఆయుర్దాయం పెరగడం వల్ల 60 ఏళ్లు దాటిన వారి సంఖ్య ప్రతి దశాబ్దంలో గణనీయంగా పెరుగుతోంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2050 నాటికి భారతదేశంలో వృద్ధుల సంఖ్య 30 కోట్లకు పైగా చేరే అవకాశం ఉంది. అంటే ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులుగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం జనాభా మార్పు కాదు; సామాజిక, ఆర్థిక, ఆరోగ్య రంగాలపై ప్రభావం చూపే పెద్ద పరిణామం. ఒకప్పుడు తల్లిదండ్రులను చూసుకోవడం పిల్లల సహజ బాధ్యతగా భావించేవారు. నేడు ఉద్యోగాల కోసం ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి, ఒక దేశం నుంచి మరో దేశానికి యువత వలస వెళ్తోంది. చాలామంది విదేశాల్లో స్థిరపడుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో వృద్ధులు ఒంటరిగా జీవించే పరిస్థితులు పెరుగుతున్నాయి. కొందరు దంపతులుగా ఉంటే, మరికొందరు జీవిత భాగస్వామిని కోల్పోయి పూర్తిగా ఒంటరైపోతున్నారు. పిల్లలు ఆర్థికంగా ఆదుకుంటున్నా, భావోద్వేగ పరమైన తోడ్పాటు లేకపోవడం వారి జీవితంలో పెద్ద లోటుగా మారుతోంది. వృద్ధాప్యంలో అత్యంత అవసరమయ్యేది డబ్బు కంటే ఆప్యాయత. రోజుకు కొన్ని నిమిషాలు పిల్లలు మాట్లాడటం, వారి ఆరోగ్యం గురించి అడగడం, పండుగలకు ఇంటికి తీసుకురావడం, మనవలు–మనవరాళ్లతో సమయం గడిపే అవకాశం కల్పించడం వంటి చిన్న విషయాలే వారికి అపారమైన ఆనందాన్ని ఇస్తాయి. కానీ ఆధునిక జీవనశైలిలో సమయాభావం కారణంగా ఈ బంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. వృద్ధుల సమస్యలు కేవలం ఒంటరితనంతో ముగియవు. వయస్సు పెరిగేకొద్దీ మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, పార్కిన్సన్స్, అల్జీమర్స్, డిమెన్షియా వంటి అనారోగ్యాలు పెరుగుతాయి. వీటికి నిరంతర వైద్యపర్యవేక్షణ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో జెరియాట్రిక్ (వృద్ధాప్య) వైద్య సేవలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వృద్ధుల వార్డులు, ఇంటి వద్ద ఆరోగ్య సేవలు, ఫిజియోథెరపీ, మానసిక ఆరోగ్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది.

మానసిక ఆరోగ్యం కూడా పెద్ద సవాలుగానే మారుతోంది. ఒంటరితనం, నిర్లక్ష్యం, జీవిత భాగస్వామిని కోల్పోవడం, పిల్లలు దూరంగా ఉండటం, శారీరక సమస్యలు వంటి కారణాల వల్ల అనేక మంది వృద్ధులు డిప్రెషన్‌కు గురవుతున్నారు. దురదృష్టవశాత్తూ మన సమాజంలో మానసిక ఆరోగ్యంపై ఇప్పటికీ సరైన అవగాహన లేదు. వృద్ధులలో కనిపించే నిరాశ, మౌనం, ఆందోళనలను "వయసు ప్రభావం"గా తీసిపారేయకుండా, అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించాలి. ఇటీవలి కాలంలో వృద్ధులపై ఆర్థిక మోసాలు, ఆస్తుల కోసం వేధింపులు, మానసిక హింస, శారీరక దాడులు కూడా పెరుగుతున్నాయి. కొందరు పిల్లలే తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టడం, ఆస్తులు రాయించుకుని నిర్లక్ష్యం చేయడం వంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు భారతీయ కుటుంబ వ్యవస్థకు మచ్చగా నిలుస్తున్నాయి. దీనిని అరికట్టేందుకు చట్టాలు ఉన్నప్పటికీ, వాటిపై అవగాహన, అమలు మరింత బలోపేతం కావాలి. అయితే ఈ సమస్యకు పూర్తిగా యువతను మాత్రమే బాధ్యులను చేయడం కూడా సమంజసం కాదు. నేటి ఉద్యోగ జీవితం తీవ్రమైన పోటీతో కూడుకున్నది. ఇద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాలు పెరిగాయి. నగరాల్లో ప్రయాణ సమయం, ఉద్యోగ ఒత్తిడి, పిల్లల చదువులు, ఆర్థిక భారం..ఇవన్నీ కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల పరస్పర అవగాహన, సర్దుబాటు అవసరం. పెద్దలు కొత్త తరాన్ని అర్థం చేసుకోవాలి; యువత పెద్దల భావోద్వేగ అవసరాలను గుర్తించాలి.

ప్రభుత్వాల బాధ్యత కూడా కీలకమే. వృద్ధాప్య పెన్షన్లను పెంచడం, సామాజిక భద్రతను బలోపేతం చేయడం, ప్రతి జిల్లాలో జెరియాట్రిక్ ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, అత్యవసర హెల్ప్‌లైన్లు, ఇంటి వద్ద వైద్య సేవలు, డే కేర్ సెంటర్లు, సీనియర్ సిటిజన్ కమ్యూనిటీ సెంటర్లను విస్తరించడం అవసరం. ప్రజా రవాణా, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రులు వృద్ధులకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. డిజిటల్ సేవల వినియోగంలో వృద్ధులకు శిక్షణ ఇవ్వడం కూడా అవసరం. బ్యాంకింగ్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ సేవలు ఇప్పుడు ఎక్కువగా ఆన్‌లైన్‌లోకి మారుతున్న నేపథ్యంలో డిజిటల్ అక్షరాస్యత వారికి కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. సమాజం కూడా తన బాధ్యతను విస్మరించకూడదు. ప్రతి కాలనీలో సీనియర్ సిటిజన్ సంఘాలు, ఆరోగ్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా కేంద్రాలు, పుస్తక క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు వృద్ధులను తరచూ కలుసుకుని అవసరమైన సహాయం అందించాలి. పాఠశాలల్లో "తాతయ్య–అమ్మమ్మల దినోత్సవాలు", తరాల మధ్య సంభాషణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో పెద్దల పట్ల గౌరవం పెంపొందించవచ్చు. సాంకేతికత కూడా వృద్ధుల జీవితాన్ని మెరుగుపరచగలదు. ఆరోగ్యాన్ని పర్యవేక్షించే స్మార్ట్ పరికరాలు, అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఇచ్చే అలర్ట్ వ్యవస్థలు, వీడియో కాల్స్ ద్వారా కుటుంబ సభ్యులతో అనుసంధానం, టెలీమెడిసిన్ సేవలు వంటి సాంకేతిక పరిష్కారాలను విస్తృతంగా వినియోగించాలి. అయితే సాంకేతికత మానవీయ అనుబంధానికి ప్రత్యామ్నాయం కాదనే విషయాన్ని మరవకూడదు. కుటుంబం అనేది ఒకే ఇంట్లో నివసించడం కాదు; పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతలతో నిలిచే బంధం. వృద్ధులు కుటుంబానికి భారంగా కాదు; అనుభవాల విశ్వవిద్యాలయం. వారు చెప్పే జీవిత పాఠాలు ఏ పాఠ్యపుస్తకంలోనూ దొరకవు. వారి అనుభవం సమాజానికి దిక్సూచి, వారి ఆశీర్వాదం కుటుంబానికి సంపద.

దేశ అభివృద్ధిని కేవలం జీడీపీ, హైవేలు, ఆకాశహర్మ్యాలతో కొలవలేం. ఒక సమాజం ఎంత నాగరికమో తెలుసుకోవాలంటే ఆ సమాజం తన వృద్ధులను ఎలా గౌరవిస్తుందో చూడాలి. మారుతున్న కుటుంబ వ్యవస్థలో బంధాలు మారవచ్చు; కానీ బాధ్యతలు మారకూడదు. తల్లిదండ్రులు మన బాల్యాన్ని కాపాడినట్లే, వారి వృద్ధాప్యాన్ని గౌరవంగా, ఆత్మీయంగా, భద్రంగా మార్చడం ప్రతి సంతానపు నైతిక బాధ్యత. వృద్ధుల చిరునవ్వు నిలిచిన ఇంట్లోనే నిజమైన కుటుంబ విలువలు జీవిస్తాయి; అలాంటి సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజంగా నిలుస్తుంది.



**- శశిధర్ అక్కెల,**
**జగిత్యాల**

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR**from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004